

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి**


జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 286 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 30-04-2025 | పేజీలు : 6


# వడివడిగా అభివృద్ధి అడుగులు

- 2025-2026కు రూ.6,60,000 కోట్ల క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ
- గత సంవత్సరం కంటే 22 శాతం అధికంగా రుణ ప్రణాళిక
- రాష్ట్రానికి రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు వస్తున్నాయి
- అండగా నిలవాలని బ్యాంకర్లకు సూచన
- ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు చేయూతనివ్వాలి : ముఖ్యమంత్రి



**అమరావతి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** వచ్చే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని... ఓవైపు స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే... మరోవైపు 2029 కల్లా పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలని, 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని మంగళవారం సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన ముఖ్యమంత్రి, 2025-26 లక్ష్యాలను నిర్దేశించారు. నూరు శాతం లక్ష్యాలను అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు ముఖ్యమంత్రి బ్యాంకర్లను అభినందించారు. సమావేశంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 'ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు.

**ఆర్థిక మద్దతుకే ఎస్ఎల్‌బీసీ సమావేశాలు :**
తాను ముఖ్యమంత్రిగా ఎప్పుడున్నా తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం... రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని... కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని... ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువ మంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధరంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

**బ్యాంకుల సహకారంతోనే పురోగతి :**
డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు. వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీ-పీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

**అన్ని ప్రాంతాల అభివృద్ధి మా విధానం :**
విశాఖ ఆర్థికాభివృద్ధిలో అనూహ్య పురోగతి సాధిస్తోందని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. అలాగే అమరావతి భవిష్యత్ అవకాశాలకు వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి అన్నారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, మత్స్యకారులు మధ్యవర్తుల ప్రమేయంతో నష్టపోతున్నారని... వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు చేయొచ్చని దీనికి బ్యాంకర్ల మద్దతు అవసరమన్నారు.

**అన్నివర్గాలకు విరివిగా రుణాలు :**
ఇంటికో ఎంట్రప్రెన్యూర్‌ను తీసుకురావాలన్న ముఖ్యమంత్రి ఆశయం మేరకు క్రెడిట్ ప్లాన్ అమలు చేస్తున్నామని... ఈ ఆర్థిక సంవత్సరంలో కచ్చితంగా లక్ష్యాన్ని అధిగమిస్తామని ముఖ్యమంత్రికి బ్యాంకర్ల తెలిపారు. ప్రత్యేకంగా మహిళా ఎంట్రప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎడ్యుకేషన్, హౌసింగ్ విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

**లక్ష్యాన్ని మించి క్రెడిట్ ప్లాన్ అమలు :**
2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం క్రెడిట్ ప్లాన్ రూ.5,40,000 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.6,83,672 కోట్ల రుణాలు ఇవ్వడం జరిగింది. ఇది లక్ష్యంలో 127 శాతం వృద్ధి. ఇందులో ప్రయారిటీ సెక్టార్‌కు రూ.4,14,824 కోట్లు, నాన్ ప్రయారిటీ సెక్టార్‌కు రూ.2,68,848 కోట్లు అందించాయి.

**వ్యవసాయరంగం :**
గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగం వరకు చూస్తే క్రెడిట్ ప్లాన్ రూ.2,64,000 కోట్లు లక్ష్యం కాగా, అంతకు మించి రూ.3,07,089 కోట్లు బ్యాంకులు అందించాయి. ఇది లక్ష్యంలో 116 శాతం వృద్ధి. ఇందులో ఖరీఫ్‌లో రూ.1,69,797 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు అందించాయి.

**ఎంఎస్ఎంఈలు :**
అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఎంఎస్ఎంఈ రంగాలకు ఈసారి భారీఎత్తున్న క్రెడిట్ ప్లాన్ అమలు చేశారు. గత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.87,000 కోట్ల లక్ష్యానికి గాను... రూ.95,620 కోట్లు ఇచ్చాయి. ఇది లక్ష్యంలో 110 శాతం వృద్ధి. ఇందులో మైక్రో ఎంట్రప్రైజెస్‌కు రూ.49,552 కోట్లు, స్మాల్ ఎంట్రప్రైజెస్‌కు రూ.27,632 కోట్లు, మీడియం ఎంట్రప్రైజెస్‌కు రూ.18,138 కోట్లు, ఇతర వాటికి రూ.298 కోట్లు అందించాయి.

**వృద్ధి శాతం తగ్గడంపై ప్రశ్నించిన ఆర్థిక మంత్రి :**
మరోవైపు క్రెడిట్ ప్లాన్ అమలులో ప్రతీ ఏటా వృద్ధి రేటు పడిపోవడంపై బ్యాంకర్లను ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రశ్నించారు. 2021-22 సంవత్సరంలో లక్ష్యంలో వృద్ధి 133 శాతం, 2022-23లో 163 శాతం, 2023-24లో 138 శాతం ఉండగా... 2024-25లో లక్ష్యంలో వృద్ధి 127 శాతమే ఉండటంపై వివరణ అడిగారు.

**2025-2026 క్రెడిట్ ప్లాన్ ఇలా :**
2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ రూ.5,40,000 కోట్లు ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి 22 శాతం అధికంగా రూ.6,60,000 కోట్లకు లక్ష్యాన్ని పెంచారు. ఇందులో వ్యవసాయ రంగం లక్ష్యం రూ.3.06,000 కోట్లు, ఎంఎస్ఎంఈ రూ.1,28,000 కోట్లు ఉంది. మొత్తం ప్రాధాన్యరంగానికి రూ.4,58,000 కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ.2,02,000 కోట్లు లక్ష్యంగా నిర్దేశించారు.

# ఇది దేశ సమగ్రతపైనే దాడి


- పర్యాటకుల హత్య అత్యంత హేయం
- కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే
- ఎవరికైనా పాక్‌పై ప్రేమ ఉంటే అక్కడికే వెళ్లాలి
- జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
- పహల్గాం అమరులకు ఘన నివాళి
- జనసైనికుడి కుటుంబానికి 50 లక్షల సాయం



**మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అతి హేయమని, అది దేశ సమగ్రతపైనే దాడి అని డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పహల్గాం ఉగ్ర దాడిలో మృతిచెందిన 26 మంది అమరులను స్మరించారు. ఈ దాడిలో మరణించిన నెల్లూరు జిల్లా కావలికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సోమిశెట్టి మధుసూదనరావుకు ఘన నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. క్రియాశీలక సభ్యత్వ బీమా కింద మరో రూ.5 లక్షలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.పది లక్షల పరిహారం ప్రకటించిందని, ఇంకా ఏమైనా అదనంగా సాయం చేయగలమేమో పరిశీలిస్తామ న్నారు. ఉగ్రవాదం జన సైనికుడిని చంపేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "పహల్గాంలో పర్యాటకులను ఉగ్ర వాదులు వేటాడి చంపడం అత్యంత హేయం. మధు సూదనరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు కావలి వెళ్లినప్పుడు ఆయన భార్య, పిల్లలు పహల్గాంలో జరిగిన ఘాతుకాన్ని వివరిస్తుంటే హృదయం ద్రవించిపోయింది. 'ఉగ్రవాదులు హిందువులనే లక్ష్యంగా చేసుకుని చంపేశారు. మేం ముస్లిం అయితే మమ్మల్ని వదిలి వేసేవారు. హిందువుగా పుట్టడం మేం చేసిన పాపమా' అని మధుసూదనరావు భార్య నన్ను ప్రశ్నిం చారు. కశ్మీర్‌లో అమాయకులపై పేలిన తూటా ప్రకంపనలు దేశమంతా వ్యాపించాయి. హిందువ్వా? ముస్లిమువా? అని అడిగి మరీ కిరాతకంగా తూటాలు దించిన ఉగ్రవాదులపై ఏమాత్రం కనికరం అవసరం లేదు. ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించడానికి దేశమంతా ఏకం కావలసిన సమయం ఆసన్నమైంది." అని పవన్ కల్యాణ్ తెలిపారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనన్నారు. విభిన్న సంప్రదాయాలు, అభిప్రాయాలు ఉండే దేశాన్ని ఏకాభిప్రాయంతో నడపాలంటే ప్రధానమంత్రి స్థాయి వ్యక్తికి ఎంతో కష్టమని, ఆయనకు మన వంతు సహకారం అందిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఇది ఎన్డీఏ భాగస్వామిగా జనసేన బాధ్యత అని చెప్పారు. "ఇప్పటికి పాకిస్థాన్‌ను మూడు సార్లు ఓడించాం. మనదేశంలో అసలు ఎంతమంది ఏ ముసుగుతో ఉంటున్నారో తెలియని పరిస్థితిలు నెలకొన్నాయి. మనకు సహనం ఎక్కువైంది. మితిమీరిన మంచితనం కూడా దేశానికి మంచిది కాదు." అని పవన్ అన్నారు. దేశంలో యుద్ధ పరిస్థితులు రావొచ్చు.. రాకపోవచ్చునని అభిప్రాయ పడ్డారు. "పహల్గాం దాడి తర్వాత కేంద్రం పాకిస్థాన్‌కు నీళ్లు ఆపడాన్ని కొందరు తప్పుబడుతున్నారు. దేశంలో లౌకికవాదం తీరు ఏమీ బాగాలేదు. 26 మందిని మత ప్రాతిపదికన చంపేస్తే.. సోకాల్డ్ సూడో సెక్యులరిస్టులు మాత్రం మతం అడిగి చంపలేదు అంటున్నారు. మధుసూదనరావు భార్య మనకు అబద్ధం చెబుతారా? కొంతమంది భారతదేశంలో కూర్చొని పాక్‌ను ప్రేమిస్తామంటారు. అలాంటి వారు అక్కడికే వెళ్లిపోండి' అంటూ ఘాటుగా స్పందించారు. పాకిస్తాన్ ఏర్పాటు సమయంలో అందర్నీ సమానంగా ఆదరిస్తామని జిన్నా చెప్పారు. కానీ, ఆనాడు పాక్‌లో రెండు కోట్ల మంది హిందువులు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య కొన్ని లక్షలమందికి పడిపోయింది." అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, ఎమ్మెల్సీ నాగబాబు, ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.

**మీరే జనసేనకు ఇంధనం.. ప్రేరణ :**
జన సైనికులు, వీర మహిళల ఆశయమే తమ పార్టీకి ఇంధనం, ప్రేరణలని పవన్ కల్యాణ్ అన్నారు. క్రియాశీలక సభ్యత్వ కిట్ల పంపిణీలో స్వచ్ఛందంగా భాగస్వాములైన వారితో మంగళవారం సాయంత్రం ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. "నేను మానవత్వాన్ని నమ్ముతాను. కొన్నిసార్లు కులాలు, మతాల ప్రస్తావన నా మాటల్లో వచ్చినా అంతిమంగా మాత్రం ప్రతి ఒక్కరూ బాగుండాలని కోరుకుంటా. విశ్వకవి గుర్రం జాషువా చెప్పినట్టు... విశ్వ నరుడిగా బతకాలని కోరుకుంటా. కులం, మతం, ప్రాంతం దాటి మనిషిగా బతకాలన్నదే నా ఆశయం." అని ఆయన పేర్కొన్నారు. పార్టీ క్రియాశీల సభ్యత్వ బీమా పరిహార సొమ్ముపెంపు అంశంపై బీమా కంపెనీలతో మాట్లాడుతున్నానని పవన్ తెలిపారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 27 ఏప్రిల్ 2025,
తిథి : శుద్ధ అమావస్య (28తా తె.01:04వ.కు),
నక్షత్రం : రేవతి (తె.03:40వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:13ల తె.05:01
రాహుకాలం : సా.04:48ల సా.06:22,
యమగండం : మ.12:05ల మ.01:40,
వర్జ్యకాలం : రా.09:10ల రా.10:45,

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 27 ఏప్రిల్ 2025,
ఫజర్ : తెల్లవారుజామున గం. 04:45
సూర్యోదయం : ఉదయం గం. 05:58
జొహర్ : మధ్యాహ్నం గం. 12:18
అసర్ : సాయంత్రం గం. 03:25
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:36
ఇష : రాత్రి గం. 07:51





జన స్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# భారత్ దెబ్బకు మరింత ఆర్థిక సంక్షోభంతో పడ్డ శత్రుదేశం

**కిలో బియ్యం రూ.339, డజన్ గుడ్లు రూ.332,**
**కిలో నెయ్యి రూ.3వేలు**

ఇప్పటికే తీవ్ర నగదు కొరత, ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌పై భారత్ విధించిన ఆంక్షలు కూడా తోడవ్వడంతో మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఏ క్షణమైనా యుద్ధం ప్రారంభం కావచ్చన్న వార్తలతో పాక్‌లో ద్రవ్యోల్బణం కొండెక్కింది. నిత్యవసరాలు, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పలు నివేదికల ప్రకారం పాక్‌లో కిలో బియ్యం ధర రూ.339గా ఉంది. డజన్ గుడ్ల ధర రూ.332గా ఉంది. లీటర్ పాల ధర రూ.224గా ఉంది. కిలో టమాట ధర రూ.150గా ఉంది. కేజీ చికెన్ ధర 800 రూపాయలు పలుకుతోంది. ఇలా ఏ ఆహార పదార్థం ధర చూసినా దిమ్మతిరిగిపోతోంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాక్ కు ఇప్పుడీ ద్రవ్యోల్బణం పెద్ద సమస్యగా మారింది. జమ్మకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడి తర్వాత.. పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక పరిణామాలను ఎదుర్కొంటోంది. పాకిస్తాన్ నుండి కార్యకలాపాలు నిర్వహిస్తున్న నిషేధిత లష్కరే తోయిబా (LeT)తో అనుబంధంగా ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF) ఈ దాడికి బాధ్యత వహించింది. ఉగ్రదాడి యావత్ దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. పాక్ పై ప్రతిచర్యలకు దిగింది. వీటిలో సింధు జల ఒప్పందాన్ని రద్దు చేయడం, పాకిస్తాన్ పౌరులు, అధికారులను భారతదేశం నుండి బహిష్కరించడం ఉన్నాయి. ఈ చర్యలు పాకిస్తాన్‌లో గణనీయమైన ఆర్థిక పతనానికి దారితీశాయి. ముఖ్యంగా నిత్యావసరల ధరలను ప్రభావితం చేశాయి. రాజకీయ, దౌత్యపరమైన ఉద్రిక్తతల మధ్య పాకిస్తాన్‌లో నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయి.

**కిలో చక్కెర రూ.180.. :**
భారత్‌లో కిలో చక్కెర ధర దాదాపు రూ.50లు. అదే పాకిస్తాన్‌లో కిలో చక్కెర ధర దాదాపుగా రూ.180లు. కరాచీలో కిలో చక్కెర ధర రూ.175 లకు చేరుకుంది. క్వెట్టాలో 164 రూపాయలుగా ఉంది. చాలా చోట్ల పాకిస్తానీయులు కేజీ చక్కెర కోసం 180 రూపాయల వరకు చెల్లిస్తున్నారు.

**వామ్మో.. నిమ్మకాయ.. :**



పాకిస్తాన్‌లో నిమ్మకాయలు కూడా విలాసవంతమైన వస్తువుగా మారుతున్నాయి. grocerapp.pk ప్రకారం, పాకిస్తాన్‌లో 250 గ్రాముల నిమ్మకాయ ధర ఇప్పుడు 234 రూపాయలుగా ఉంది. పాకిస్తాన్‌లో తేనె ధర విపరీతంగా పెరిగింది. grocerapp.pk ప్రకారం 500 గ్రాముల తేనె ధర రూ.550 నుండి రూ.770లుగా ఉంది. పాకిస్తాని వంటశాలలలో ప్రధానమైన వంట పదార్థమైన నెయ్యి చాలా ఖరీదైనదిగా మారింది. grocerapp.pk ప్రకారం కిలో నెయ్యి ధర ఇప్పుడు 2వేల 895 రూపాయలుగా ఉంది.

**పాకిస్తానీ సూట్ల అమ్మకాలలో తగ్గుదల.. :**

## ఎడిటోరియల్

పాకిస్తానీ సూట్లు, ముఖ్యంగా మహిళల దుస్తులు, భారతదేశంలో చాలా కాలంగా ప్రాచుర్యం పొందాయి. అయితే, పహల్గామ్ దాడి, దాని ఫలితంగా ఏర్పడిన దౌత్యపరమైన పరిణామాల తర్వాత ఈ సూట్ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయి.

**వాణిజ్య ఆంక్షల ప్రభావం.. :**
భారత్ అట్టారి–వాఘా సరిహద్దును కూడా మూసివేసింది. దీనితో దాదాపు రూ.3,886.53 కోట్ల విలువైన సరిహద్దు వాణిజ్యం నిలిచిపోయింది. ఇది పాకిస్తాన్‌లో ఔషధాల నుండి ఎరువుల వరకు వివిధ వస్తువుల లభ్యతను ప్రభావితం చేసింది. దీని వలన ధరలు మరింత పెరిగాయి. ఇప్పటికే తీవ్ర నగదు కొరత, ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ పై భారత్ విధించిన ఆంక్షలు కూడా తోడవ్వడంతో మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఏ క్షణమైనా యుద్ధం ప్రారంభం కావచ్చన్న వార్తలతో పాక్‌లో ద్రవ్యోల్బణం కొండెక్కింది. నిత్యవసరాలు, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. పలు నివేదికల ప్రకారం పాక్‌లో కిలో బియ్యం ధర రూ.339గా ఉంది. డజన్ గుడ్ల ధర రూ.332గా ఉంది. లీటర్ పాల ధర రూ.224గా ఉంది. కిలో టమాట ధర రూ.150గా ఉంది. కేజీ చికెన్ ధర 800 రూపాయలు పలుకుతోంది. ఇలా ఏ ఆహార పదార్థం ధర చూసినా దిమ్మతిరిగిపోతోంది. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాక్‌కు ఇప్పుడీ ద్రవ్యోల్బణం పెద్ద సమస్యగా మారింది.



**జమ్ము సాయి కల్యాణ్,**
**పొలిటికల్ అనలిస్టు,**
**మేనేజింగ్ డైరెక్టర్,**
**జనస్వరం మీడియా.**

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



**పులివెందుల, ఏప్రిల్ 29 (జనస్వరం) :** రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ జీఎం శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం రాములు అన్నారు. మంగళవారం తుమ్మలపల్లి ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎంఎస్ కంపెనీ మాజీ చైర్మన్ అభయ్ సన్ చీటీ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు ఎస్ఎంఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ఖలీల్ సౌదాగర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో సుమారు వందమంది కార్మికులు రక్తదానం చేశారు. రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు రక్తదానంపై ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దన్నారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వల్ల మన ఆరోగ్యంతో పాటు ఇతరుల ప్రాణాలు కాపాడినట్లు అవుతుందన్నారు అందువల్ల ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్ కుమార్ అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల సుడిగుండంలో వేంపల్లి పంచాయతీ

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు తులసి రెడ్డి లేఖ**



**పులివెందుల ఏప్రిల్ 29 (జనస్వరం) :** కడప జిల్లా వేంపల్లి పంచాయితీ సమస్యల సుడిగుండంలో చిక్కుకుందని వెంటనే కాపాడాలంటూ మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి మంగళవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ పవన్ కళ్యాణ్‌లకు లేఖ రాశారు. ఆ లేఖలోని సారాంశం ఇలా ఉంది. ప్రభుత్వం పట్టించుకోదు. మాజీ సీఎం జగన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని వేంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. మురికి కూపంగా తయారయింది. దాదాపు 60 వేల జనాభా ఉంటుంది. గత మార్చి నెల 5న అక్రమాలు జరిగాయని ఈఓను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈఓఆర్డీని బదిలీ చేసింది. అప్పటి నుండి ఆ అధికారులు లేరు. అవినీతి ఆరోపణలు, రాజకీయ జోక్యంతో భయపడి ఎవ్వరూ రావడం లేదు. తెనాలి రామలింగడు, పిల్లి కథ లాగా తయారయింది. పారిశుధ్య, వాటర్ స్కీమ్ సిబ్బందికి 6 నెలలుగా జీతాలు లేవు. గ్రామ పంచాయతీ పరిధిలో 8 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. 60 మంది గ్రామ సచివాలయం సిబ్బంది ఉన్నారు. 2 నెలలుగా వీరికి జీతాలు లేవు. పారిశుధ్యం అధ్వాన్నం అయింది. మురికి నీటి కాలువలు చెత్త, చెదారం, ప్లాస్టిక్ సామాగ్రితో నిండిపోయాయి. మురుగు నీరు రోడ్ల మీద ప్రవ హిస్తూ ఉంది. పందులు, కుక్కలు, ఆవులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మలేరియా, డెంగ్యూ, అతిసార, టైఫాయిడ్ తదితర వ్యాధులు విజృంభించాయి. భూగర్భ జలాలు అడుగంటి పోయి బోర్లు ఎండిపోయాయి. తాగునీటి సమస్య జటిలమయింది. ఇంటి పన్ను, నీటి పన్ను రాబట్ట డం లేదు. మార్చి 31కి మార్కెట్ వేలం గడువు ముగిసింది. ఈఓ లేని కారణంగా టెండర్ వేయ లేదు. ప్రధాన ఆదాయ వనరు నిలిచిపోయింది. రూ.1.40 కోట్లతో నిర్మించిన రైతు బజార్ పంచా యితీ రాజ్, మార్కెటింగ్ శాఖల మధ్య సమన్వయం లేక ప్రారంభానికి నోచుకోలేదు. సంపద కేం ద్రం దరిద్ర కేంద్రంగా దర్శనమిస్తోంది. స్వచ్ఛ వేంపల్లిగా కాకుండా మురికి వేంపల్లిగా తయారయి ంది. నియోజకవర్గ ఎమ్మెల్యే జగన్‌కు ప్రతిపక్ష నాయకుని హోదా తప్ప నియోజకవర్గ సమస్యలు పట్టడం లేదు. స్థానిక అధికార కూటమి నాయకులు పట్టించుకోవడం లేదు. జిల్లా అధికార యంత్రా ంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. ఈ నేపథ్యంలో సంబంధిత పంచాయితీ రాజ్ శాఖ మంత్రిగా కనీ సం మీరైనా దృష్టి సారించండి. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ఈఓ, ఈఓఆర్డీలను నియమించ ండి. సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించండి. పారిశుధ్యంపై దృష్టి పెట్టండి. తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి. రైతు బజార్‌ను ప్రారంభించండి. తమ లేకకు స్పందిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కనుమరుగవుతున్న ప్రాచీన సంప్రదాయ క్రీడలు







**పులివెందుల, ఏప్రిల్ 29 (జనస్వరం) :** వేసవి వచ్చిందంటే పల్లెటూర్లలో సంప్రదాయ క్రీడల సందడి ఉంటుంది. ఈ సందడి నేడు గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కనిపించలేదు. గోలీలు, పుట్టచెండు, దాగుడుమూతలు, పిల్లంగోడు, గోడు, జిక్కికి వంటి ఆటపాటలు అందాన్ని కలిగించేవి, ఈ ఆటపాటలు ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ఆనందాన్ని అందించడంతో పాటు శారీరకంగా వ్యాయామపారంగా ఎంతో ఉపయోగపడేవి. కానీ నేడు స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్ లైన్ వంటి గేములు నేటితరం పిల్లల బాల్యాన్ని ఆక్రమించాయి. వేసవి సెలవులు అంటే పల్లెటూరి వీధుల్లో పిల్లల ఆటల హడావిడ్, బొంగరాల చప్పుడు, గోళీల కిలకిల సౌందర్యం. సూమిడి చెట్ల వేపచెట్ల నీడలో, గుండ్రని గీతలో బొంగరాలు తిప్పుతూ, గోలీలను గురిపెట్టి కొట్టే పిల్లల ఆనందం అంతా ఇంతా కాదు. ఆ ఆటలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదుబీ అవి పిల్లలను శారీరకంగా చురుకుగా, మానసికంగా ఉత్సాహంగా, సామాజికంగా కలుపుగోలుగా తీర్చిదిద్దేవి. కానీ, ఈ చిత్రం పూర్తిగా మారిపోయింది. నేటి తరం పిల్లల బాల్యాన్ని ఆక్రమించాయి. పల్లెటూరి బడి ముందరి ఆట స్థలంలో, సాయంత్రం అయితే చాలు, పిల్లలు గుండెలు విరిచేలా ఆడుకునేవారు. బొంగరం తిప్పడానికి జాటీని చుట్టుతూ, దాన్ని నేలపై విసిరి ఎక్కువ సేపు తిరిగేలా చేయడానికి పిల్లలు పోటీపడేవారు. గోళీల ఆటలో గురి చూసి కొట్టడం, స్నేహితులతో ఆనందంగా నవ్వుకోవడయివన్నీ పిల్లలకు శారీరక వ్యాయామంతో పాటు సామాజిక నైపుణ్యాలను నేర్పేవి. ఈ ఆటలు కేవలం ఆటలు మాత్రమే కాదుబీ అవి స్నేహ బంధాలను బలపరిచే, ఓర్పును, దృష్టిని, సమన్వయాన్ని పెంపొందించే పాఠశాలలు. ఈ రోజు, పిల్లల చేతిలో బొంగరం జాటీ లేదా గోళీల సంచి కనిపించడం అరుదు. బదులుగా, స్మార్ట్‌ఫోన్‌లు వారి ప్రపంచాన్ని ఆక్రమించాయి. ఆన్‌లైన్ గేమ్‌లు, సోషల్ మీడియా యాప్‌లు పిల్లలను గంటల తరబడి ఒకే చోట కూర్చోబెట్టాయి. ఈ గేమ్‌లు రంగురంగుల గ్రాఫిక్స్‌తో ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, అవి పిల్లల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అధిక స్క్రీన్ టైమ్ వల్ల కంటి సమస్యలు, ఒత్తిడి, నిద్రలేమి, ఏకాంతం మనసికరుగ్మతలు వంటి సమస్యలు చిన్నపిల్లల్లో పెరుగుతున్నాయి. సోషల్ మీడియాలో లైక్‌లు, కామెంట్‌ల కోసం పోటీ పడుతూ, పిల్లలు తమ స్నేహితులతో నిజమైన బంధాన్ని కోల్పోతున్నారు. ఒకప్పుడు బొంగరాల ఆటలో ఓడినా, గెలిచినా పిల్లలు నవ్వుకునేవారు. ఆ ఆటలు వారిలో సహనాన్ని, ఓటమిని ధైర్యంగా ఎదుర్కొనే తత్వాన్ని నేర్పాయి. కానీ, ఆన్‌లైన్ గేమ్‌లు ఒక్కోసారి విపరీతమైన ఒత్తిడిని, ఆందోళనను కలిగిస్తాయి. గేమ్‌లో ఓడిపోతే కోపం, విజయం కోసం అనవసర ఖర్చులు చేయడం వంటివి పిల్లల మానసిక స్థితిని దెబ్బతీస్తున్నాయి. వారిలో ఆత్మస్థైర్యాన్ని క్షీణింపచేస్తున్నాయి. శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల ఊబకాయం, బలహీనత వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. బొంగరం తిరిగే చప్పుడు, గోళీలు గురిపెట్టే ఉత్సాహం ఇవి కేవలం ఆటలు కాదు అవి బాల్యాన్ని అందంగా మలిచే జ్ఞాపకాలు. స్మార్ట్‌ఫోన్‌ల గిలక్కాయల మధ్య ఈ తరం బాల్యం ఆనందాన్ని కోల్పోతున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.



## ఉపాలయాలలో.. పరివారదేవతలకు పూజలు..



**శ్రీశైలం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** శ్రీశైలక్షేత్రంలో మంగళవారాన్ని పురస్కరించుకుని క్షేత్రపరిధిలోని ఉపాలయాలలోని పరివారదేవతలకు దేవస్థానం నిర్వహిస్తున్న సేవలతో భాగంగా లోకాకళ్యాణార్థం సుబ్రహ్మణ్యస్వామికి, బయలు వీరభద్రస్వామికి, నందీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపించామని కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఆయా పూజలలో ఆలయ అర్చకులు, వేదపండితులు సాంప్రదాయబద్ధంగా లోకాసుభిక్షం కోసం శాస్రోక్తంగా మహాసంకల్పాన్ని పఠించి నిర్విఘ్నంగా పూజలు జరిగేందుకు మహాగణపతి పూజలు నిర్వహించి సుబ్రహ్మణ్యస్వామికి అర్చకస్వాములు వేదమంత్రోచ్ఛారణలతో పంచామృతాభిషేకం, తదుపరి ఫలోదకం, పాలు, పెరుగు, నెయ్యి తేనె కొబ్బరినీళ్లు వంటి ద్రవ్యాలతో అభిషేకం జరిపారు. అనంతరం అర్చనలు, హారతి పూజలు చేశారు. అదేవిధంగా బయలు వీరభద్రస్వామికి పంచామృతాభిషేకం, ఫలోదక, బిల్వోదక, భస్మోదక, గంధోదక, పుష్పోదకాలతో, మల్లికాగుండంలోని శుద్ధజలాలతో శాస్రీకంగా అభిషేకించారు. తదుపరి ప్రత్యేక హారతులు సమర్పించారు. మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కొలువైవున్న నందీశ్వరస్వామికి ఆగమశాస్రానుసారంగా ప్రదోషకాల పూజలు నిర్వహించి యధావిధిగా పంచామృతాభిషేకం, అన్నాభిషేకం, పురుషసుక్తం, వృషభసూక్తం వంటి పూజలు జరిపి నానబెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించారు.

## చెత్త కుండీ ఏర్పాటు చేశారు.. చెత్త తీయడం మరిచిపోయారు...!

**- చింతపల్లి రామాలయం వీధి గిరిజన సంక్షేమ కేంద్రకృత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త కుప్పలలో పేరుకుపోయిన చెత్త**



**చింతపల్లి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ముత్యాలమ్మ జాతర సందర్భంగా చింతపల్లి గ్రామంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటించిన పంచాయతీ అధికారులు తమ హామీని కేవలం చెత్త కుండీల ఏర్పాటు చేయడం వరకు మాత్రమే పరిమితం అయినట్లుగా కనిపిస్తోంది. జాతర సమయంలో పరిశుభ్రతలో భాగంగా పలు ప్రాంతాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేసిన అధికారులు నిండిన చెత్తను తొలగించడం మరిచారు. ముఖ్యంగా రామాలయం వీధి గిరిజన సంక్షేమ కేంద్రకృత ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త కుండీ వ్యర్థపదార్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతుంది. పట్టించుకోవలసిన అధికారులు చోద్యం చూస్తున్నారు. పండుగ ముగిసి నేటికి మూడు రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఆ చెత్తను తొలగించకపోవడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రతపై పంచాయతీ ప్రకటించిన బాధ్యత ఏమైందని వారు ప్రశ్నిస్తున్నారు. చెత్త నిల్వల వల్ల మానవ ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నా! సంబంధిత అధికారులు బాధ్యతా రహిత్యంగా వ్యవహరించడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చెత్తను తొలగించి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో అపశ్రుతి..



గోడకూలి ఏడుగురు భక్తులు మృతి

**సింహాచలం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** విశాఖ జిల్లా సింహాద్రి అప్పన్న స్వామి చందనోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సింహాచలంలో భారీ వర్షం కురిసింది. దీంతో సింహగిరి బస్టాండ్ నుంచి ఎగువకు వెళ్లే మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద రూ.300 టికెట్ క్యూలైన్‌పై సిమెంట్ గోడ కూలింది. వెంటనే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఏడుగురి మృతదేహాలను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

నిజరూపంలో దర్శనమిస్తున్న అప్పన్న..

వరహా లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఇప్పటికే భారీ ఎత్తున సింహగిరికి పోటెత్తారు. వేకువజామున ఒంటిగంటకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం స్వామివారి దేహంపై ఉన్న చందనాన్ని వెండి బొరిగెలతో అత్యంత సున్నితంగా వేరుచేశారు. నిజరూపంలోకి వచ్చిన స్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాల అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వారు స్వామివారికి తొలి చందనాన్ని సమర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరఫున రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తితిదే పట్టు వస్త్రాలు సమర్పించారు. ఉదయం 3 గంటల నుంచి 6 గంటల వరకు ప్రొటోకాల్, అంతరాలయ దర్శనాలను ఏర్పాటు చేశారు.











## అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 29 (జనస్వరం) :** మండలపరిధిలోని టేకులగడ్డ తండా అంగన్వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం సూపర్వైజర్ మణిమాల మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు నృత్యాలు పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మణిమాల, లింగంపల్లి పాఠశాల హెచ్ఎం శ్రీహరి, అంగన్వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, రాధ, చంద్రకళ, వాణి, గోర్ సేనా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రెసిడెంట్ టి.రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముద్దం శ్రేయాన్ కార్తికేయకు జాతీయ వుషు పోటీలకు ఎంపిక

బంగారు పతకంతో విజయం.. నిర్మల్ జిల్లా గర్వించదగిన క్రీడాకారుడు



**నిర్మల్, ఏప్రిల్ 29 (జనస్వరం) :** సిరిసిల్ల జిల్లాలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 28 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి వుషు పోటీల్లో నిర్మల్ జిల్లాకు చెందిన ముద్దం శ్రేయాన్ కార్తికేయ ప్రతిభ కనబరిచారు. 28 కేజీల విభాగంలో పోటీస్థుల మధ్య తన విశిష్ట క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఈ విజయంతో శ్రేయాన్ కార్తికేయ మే 26 నుండి 31వ తేదీ వరకు తమిళనాడులో జరగనున్న జాతీయ స్థాయి వుషు పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సాయి కృష్ణ, జ్ఞాన తేజ, సాయి నాథ్ తదితరులు శ్రేయాన్ కార్తికేయను అభినందించారు. క్రీడా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్మల్ జిల్లా ప్రతిష్ఠను పెంచిన కార్తికేయకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## పహల్గామ్ ఉగ్రదాడిలో అమరుడైన జనసైనికుడు మధుసూదనరావు కుటుంబానికి రూ.55 లక్షల ఆర్థిక సహాయం

జనసేన పార్టీ తరఫున పవన్ కళ్యాణ్ ప్రకటించిన సాయం





**మంగళగిరి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పహల్గామ్ ఉగ్రవాద దాడిలో అమరుడైన క్రియాశీలక జనసైనికుడు మధుసూదనరావు కుటుంబానికి జనసేన పార్టీ తరఫున రూ.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేయనున్నట్లు జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటిం చారు. అదనంగా జనసేన పార్టీ ప్రమాద బీమా పథకం ద్వారా మరో రూ.5 లక్షల బీమా నగదు తో కలిపి మొత్తం రూ.55 లక్షలు కుటుంబానికి అందించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదనరావు సేవలను పవన్ కళ్యాణ్ గుర్తుచేస్తూ, "దేశం కోసం, పార్టీ కోసం త్యాగం చేసిన వారిని మేము ఎప్పటికీ మరిచిపోం. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడం మన బాధ్యత," అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కీలక నేతలు నాదెండ్ల మనోహర్, నాగబాబు, హరిప్రసాద్, పి. కందుల, లక్ష్మీ, దుర్గేశ్ ప్రసాద్, శతఘ్ని అనుష, జనసేన అజయ్ కుమార్, వెములపాటి కళ్యాణం, శివ శ్రీనివాసరావు (కేకే), రాజేష్ మండలి, సమినేని ఉదయ భాను తదితరులు పాల్గొన్నారు. పార్టీ మద్దతుతో, మధుసూదనరావు కుటుంబానికి అండగా నిలబడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని నేతలు స్పష్టం చేశారు. అమరుడైన జనసైనికుడికి ఘనంగా నివాళులర్పించారు.

## మాజీ ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు సేవా నిబద్ధతకు నిదర్శనం

టీడీపీ నేతల సంస్మరణ



**పెడన, ఏప్రిల్ 29 (జనస్వరం) :** మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ కాగిత వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర పార్టీ కార్యదర్శులు గన్నె ప్రసాద్, కొత్త నాగేంద్ర కుమార్ (నాగబాబు) నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమ ప్రారంభంలో కాగిత వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాగిత వెంకట్రావు తెలుగుదేశం పార్టీకి జీవాంతకమై సేవలందించిన నేత అని, బడుగు బలహీన వర్గానికి చెందిన ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి రాజకీయాల్లో కీలక స్థాయికి చేరారని కొనియాడారు.

**వెంకట్రావు సేవలు :**

1985లో తొలిసారిగా శాసనసభ్యునిగా విజయం సాధించి, 1994లో నందమూరి తారకరామారావు అధ్వర్యంలో అభ్యర్థుల జాబితాలో రెండో స్థానంలో చోటు పొందిన ఘనత కాగిత వెంకట్రావుదని వారు గుర్తు చేశారు. తర్వాతి కాలంలో ప్రభుత్వ విప్‌గా, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా, శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్‌గా, ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ పట్ల ఆయనకు అపారమైన అనురాగం ఉండేదనీ, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలబడటమే ఆయన లక్ష్యమన్నారు. ఎన్టీఆర్ నుండి చంద్రబాబు నాయుడు వరకు అందరూ వెంకట్రావుని ప్రత్యేకమైన అభిమానం, ఆదరణతో 'వెంకట్రావు' అని పిలుచుకునేంత మానవీయత కలిగిన నాయకుడని ప్రశంసించారు. ప్రస్తుతం పెడన శాసనసభ్యుడిగా ఉన్న కాగిత కృష్ణ ప్రసాద్‌కు అవకాశం కల్పించి గెలిపించగలిగినవారిలో కాగిత వెంకట్రావు పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపూడి నాగేశ్వరరావు, మరక శ్రీనివాస్ యాదవ్, బెజవాడ తిరుపతి గౌడ్, దేవర సత్యనారాయణ, బొల్లా వెంకటేశ్వరరావు గౌడ్, వాకా వెంకటేశ్వరరావు గౌడ్, పొన్నం రవికుమార్, కోడూరు ఆంజనేయ వాసు, జాస్తి సురేష్, భీమవరపు వెంకట కోటేశ్వరరావు, మన్నెం పోతరాజు, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జైలు నుంచి విడుదలయ్యారో..

లేదో మాధవ్ నోట మళ్లీ 'వెంట్రుక' భాష



**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ముఖ్యమంత్రి చంద్రబాబు హత్యా రాజకీయాలు, అక్రమ అరెస్టులు, వైకాపా నాయకులు, శ్రేణుల పిక్క మీద వెంట్రుక కూడా పెరకలేవని వైకాపా నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యాఖ్యానించారు. పోలీసు కస్టడీలో ఉన్న ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై దాడి కేసులో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు బెయిల్ మంజూరైంది. మంగళవారం రాత్రి బెయిల్‌పై బయటికి రాగానే మాధవ్ 'తనదైన భాష' అందుకున్నారు. కారాగారం బయట విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైకాపా ఓడేది లేదు.. కూటమి మరోసారి గెలిచేది లేదన్నారు. ప్రతిరోజు ఓ రాజకీయ హత్య, ఓ అక్రమ అరెస్టుతో ఈ రాష్ట్రాన్ని ఉక్కు పిడికిళ్లలో బిగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ కేసులో మాధవ్‌తోపాటు అరెస్టయిన సి.రమేష్, టి.దామోదర్, డి.శివప్రసాద్, సి.శివయ్య, జి.సురేందర్‌లను జైలు అధికారులు విడుదల చేశారు.

## కేసుల ఉచ్చులో పీఎస్ఆర్

- తాజాగా మరొకటి నమోదు
- ఏపీపీఎస్సీ అక్రమాలపై ఫిర్యాదు
- హాయ్‌ల్యాండ్ వేదికగా రాంగ్‌రూట్
- గ్రూప్-1 మెయిన్స్ జవాబు పత్రాలు రెండు సార్లు మూల్యాంకనం
- పీఎస్ఆర్ నేతృత్వంలో మొదటిసారి
- కోర్టు ఆర్డర్‌తో రెండోసారి దిద్దుబాటు
- అభ్యర్థులు పసిగట్టి న్యాయ పోరాటం



**విజయవాడ/అమరావతి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** సీనియర్ ఐపీఎస్ అధికారి పి. సీతారామాంజనేయులు(పీఎసఆర్) చుట్టూ కేసుల ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనపై మరో కేసు నమోదైంది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూపు-1 పరీక్ష పత్రాల మూల్యాంకనంలో ఆయన అక్రమాలకు తెరదీశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా వీటిపైనే క్రైం నంబరు 56/2025తో ఈ కేసు నమోదైంది. ఉన్నతాధికారులు ఈ కేసు విచారణ బాధ్యతలను నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్‌కు అప్పగించారు. గ్రూపు-1 పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని గుంటూరు జిల్లా హాయ్‌ల్యాండ్‌లో చేయించారని ఆరోపణలు ఉన్నాయి. నాడు పరీక్షలు రాసిన అభ్యర్థులు ఇదే విషయాన్ని బహిరంగంగా చెప్పారు. అయితే, అలా ఎందుకు చేయాల్సి వచ్చిందన్నది ప్రశ్న. ఈ క్రమంలో మంగళవారం దర్యాప్తు అధికారులు ఇద్దరు వ్యక్తుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేసినట్టు తెలిసింది.

ఆ కేసు వివరాలు ఇవ్వండి: హైకోర్టు

గుంటూరు నగరంపాలెం పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసిన వ్యవహారంలో అప్పటి నిఘా విభాగాధిపతి పాత్ర ఉందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గత ఏడాది గుంటూరు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ పీఎసఆర్ హైకోర్టును ఆశ్రయించారు.

పూజకు.. పుస్తకాలు ఇవ్వట్లేదు : పీఎస్ఆర్

జైలులో తాను పూజ చేసుకోవడానికి పుస్తకాలు, నుదుటున పెట్టుకోవడానికి బొట్టు ఇవ్వడం లేదని ఐపీఎస్ అధికారి పీఎసఆర్ ఆంజనేయులు న్యాయాధికారికి విన్నవించారు. సీఐడీ కస్టడీ ముగిసిన అనంతరం పోలీసులు మంగళవారం ఆయనను విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. ఈ సందర్భంగా న్యాయాధికారి పి. భాస్కరరావు.. "కస్టడీలో పోలీసులు ఏమైనా ఇబ్బంది పెట్టారా?" అని అడిగారు. దానికి సీతారామాంజనేయులు జవాబు ఇస్తూ.. "నేను పూజ చేసుకోవడానికి పుస్తకాలు, నుదుటన పెట్టుకోవడానికి బొట్టు ఇవ్వడం లేదు. నేను జైలుకు వెళ్లిన మర్నాడు వాకింగ్‌కు వెళ్లినప్పుడు టీవీ ఉందని చెప్పారు. తర్వాత టీవీ లేదన్నారు. నా వల్ల ఇతర ఖైదీల సదుపాయాలు పోతున్నాయి. నేను జైలుకు వెళ్లడానికి ముందు ఇతర ఖైదీలకు 5 ములాఖత్‌లు ఉండేవి. నేను వెళ్లిన తర్వాత వాటిని మూడుకు కుదించారు. కస్టడీలో పోలీసులు ఇబ్బంది పెట్టలేదు. నేను ఫిట్‌గా ఉన్నప్పటికీ బీపీ ఎక్కువగా ఉందని పోలీసులు ఒక రోజు కస్టడీలోకి తీసుకోలేదు. మరోసారి పోలీసు కస్టడీకి ఇచ్చినా సహకరిస్తా" అని తెలిపారు. జైలులో ఏమైనా సదుపాయాలు కావాలంటే ఒక పిటిషన్ వేసుకోవాలని న్యాయాధికారి ఆయనకు సూచించారు. అనంత పీఎస్ఆర్‌ను పోలీసులు విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

## ఏపీఎస్ఆర్టీసీ ఎండి మొండివైఖరికి వ్యతిరేకంగా ఎమ్మిగనూరులో రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు

- నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యమం వేగంగా సాగుతుంది



**ఎమ్మిగనూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఏపీఎస్ఆర్టీసీ మేనేజ్మెంట్ మొండివైఖరికి నిరసనగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ పిలుపు మేరకు ఎమ్మిగనూరు డిపోలో రెండవ రోజు రిలే నిరాహార దీక్షలు మంగళవారం కొనసాగాయి. రీజనల్ సహాయ కార్యదర్శి ఎన్.పి.ఎం. సాహెబ్ అధ్యక్షతన జరిగిన దీక్షల కార్యక్రమంలో డిపో కార్యదర్శులు ఎస్. ముస్తాక్ అహ్మద్, గ్యారేజీ కార్యదర్శి కె.వి. భాస్కర్ నేతృత్వం వహించారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం డిపో గేట్ వద్ద ప్లే కార్డులతో నిర్వహించిన నిరసన కార్యక్రమం అనంతరం నిరాహార దీక్షలకు అల్వాల నాగరాజు, ఎస్. కాసిం, కే.ఎం. భాష, ఎల్. బందే నవాజ్ కూర్చొన్నారు. కార్యక్రమానికి సంఘీభావంగా నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కర్నూలు రీజియన్ రీజనల్ సెక్రటరీ సి.మద్దిలేటి విచ్చేసి దీక్షలో పాల్గొన్న వారికి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆదోని డిపోకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ప్రసంగించిన రీజనల్ సహాయ కార్యదర్శి ఎన్‌పిఎం సాహెబ్ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ దీక్షలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో కూడా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ప్రతి సభ్యుడు సంపూర్ణంగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సంయుక్త కార్యదర్శి సురేష్ బాబు, ఉపాధ్యక్షులు కె.ఎం. సాహెబ్, ప్రచార కార్యదర్శులు బజారప్ప, ఎం.ఎల్. రెడ్డి, కోశాధికారి జి.బి. నవాజ్, ఎలక్ట్రీషన్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుతోనే బీసీల బాగు..

- అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి
- గౌడ కార్పొరేషన్ ద్వారా బీసీలక న్యాయం చేయాలి : కొనకళ్ల
- కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు సాధ్యం
- చంద్రబాబు కలల సాకారమే లక్ష్యం కావాలి
- విజనరీ నాయకుడి స్ఫూర్తితో ఐక్యంగా పనిచేసి గౌడ కార్పొరేషన్‌కు వన్నె తీసుకువద్దాం
- గౌడ కార్పొరేషన్ సమావేశంలో చైర్మన్ 'వీరంకి'



**విజయవాడ, ఏప్రిల్ 29 (జనస్వరం) :** రాష్ట్రంలో ఎన్డీఎ కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా పనిచేస్తోందని, అర్హులందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందాలని, అప్పుడే ప్రభుత్వ పనితీరు తెలుస్తుందని, గౌడ కార్పొరేషన్ ద్వారా గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజికవర్గీయులకు న్యాయం చేయాలని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పిలుపునిచ్చారు. గొల్లపూడి బీసీ భవన్లో ఏపీ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి ఆధ్వ ర్యంలో కార్పొరేషన్ మొట్టమొదటి సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, జాయింట్ మేనేజర్ తనూజ, కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాత జయప్రకాష్ తోపాటు కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. బీసీ వర్గాలు తెలుగుదేశం పార్టీకి వెన్నెముకలా ప్రతీ ఎన్నికల్లోనూ అండగా నిలుస్తున్నాయన్నారు. గౌడ కార్పొరేషన్ ద్వారా కార్పొరే షన్ పరిధిలో ఉన్న గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజికవర్గీయులు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తితోపాటు డైరెక్టర్లకు సూచించారు. సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో పైన పేర్కొన్న సామాజికవర్గాల అభ్యు న్నతే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గత చైర్మన్ జయప్రకాష్ సార థ్యంలో 2014-19 సంవత్సరాల్లో గౌడ కార్పొరేషన్ ద్వారా రూ. 110 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పేరుకే కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించకుండా దారుణంగా మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభు త్వం కార్పొరేషన్ ద్వారా అవసరమైన నిధులు మంజూరు చేస్తోం దని, ఆదరణ పథకం ద్వారా ఉపకరణాలతోపాటు గ్రూపు రుణా లు ఇస్తోందని, ఇవన్నీ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గౌడ, శెట్టిబ లిజ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజికవర్గీయులకు చేరి వార ంతా లబ్ధిపొందేలా గురుమూర్తి సారథ్యంలో కృషి చేయాలని నారా యణరావు సూచించారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ.. కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు సాధ్య మని, బాధిత వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తూ మేమున్నామంటూ భరోసా కల్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఆకాంక్షలు, గౌడ కార్పొరే షన్ కలలు సాకారం అవుతామన్నారు. మనపై ఎంతో నమ్మకంతో గౌడ కార్పొరేషన్ బాధ్యతలను అప్పగించిన సీఎం చంద్రబాబు సారథ్యంలో మనమంతా పనిచేస్తూ ఆయన కలల సాకారమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. తాను చైర్మన్ అన్న భావన కంటే మనమంతా ఒక్కటేనన్న భావనతో ఉంటానని, తనకు పెద్ద, చిన్నా, పేద ధనిక తారతమ్యం ఉండని, తాను ఎక్కడైనా ఒదిగే ఉంటానని, మనంపై నమ్మకం ఉంచి మనకు బాధ్యతలు అప్పగిం చిన చంద్రన్న ఆశయాల సాధనే ధ్యేయంగా పనిచేద్దామని, మన మంతా ఐక్యంగా పనిచేసి గౌడ కార్పొరేషన్‌కు వన్నె తీసుకువద్దా మని గురుమూర్తి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో పేర్కొన్న పలు అజెండాలపై గురుమూర్తి మాట్లాడారు. ముఖ్యంగా కల్లు ద్వారా నీరా పరిశ్రమను మరింత అభివృద్ధి చేయాలని, తాటి ఉత్పత్తులైన తాటిబెల్లం, తాటి షుగర్ తదితరాలను ప్రోత్సహించా ల్సిన అవసరం ఉందన్నారు. గౌడ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామని. చంద్రన్న బీమా పథకం మళ్లీ అమలుకు సీఎం చంద్రబాటు దృష్టికి తీసుకువెళదామని, ఏపీలో గీత కార్మికుల కోసం తాటికల్లు బోర్డు ఏర్పాటుకు, స్కిల్ డెవల ప్మెంట్ ద్వారా గౌడ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్ప నకు కృషి చేస్తామన్నారు. మనం కష్టపడి పనిచేస్తే నిధులిచ్చే ందుకు సీఎం చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారన్నారు. బాబు తోనే బీసీల బాగు సాధ్యమన్నారు. తాను దివంగత ఎన్టీఆర్ హయాం నుంచి, ఆ తరువాత నేటి సీఎం చంద్రబాబు నాయక త్వంలో పార్టీనే నమ్ముకుని ముందుకుసాగుతున్నానని, ఈ క్రమం లో సీఎం చంద్రబాబు తనకు గౌడ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చారని, తనపై నమ్మకంతో ఆయన ఇచ్చిన చైర్మన్ పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తానన్నారు. విజనరీ నాయకుడైన చంద్రబాబుతోనే గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సామాజికవర్గాల అభి వృద్ధి సాధ్యమని, పాలనలో అన్నిఅంశాలను మిళితం చేసి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర సాధన దిశగా ముందుకు నడుపుతున్న బాబు బాటలో మనమంతా పయనిస్తూ సీఎం చంద్రబాబు మనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా కార్యదీక్షతో పనిచేసి గౌడ కార్పొరేషన్ను రాష్ట్రంలోని అన్ని కార్పొరేషన్ల కన్నా మొదటిస్థానం లో ఉంచుదామని, అందుకు మీరంతా తనకు సహాయ సహకా రాలు అందించాలని గౌడ కార్పొరేషన్ పాలకవర్గాన్ని వీరంకి గురుమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్స్ శౌంఠి శివరామా ప్రసాద్, లక్ష్మీ శైలజ, పంది ధనుంజయ్, మట్ట ప్రకాష్, యామన నారాయణ, వీరమల్ల వరలక్ష్మి, మిద్దె ఆదినారాయణ, యమాన నారాయణ గౌడ్ బడుగు శ్రీకాంత్, జంపాన రామచంద్ర, కందుల వెంకటరమణ, వెలగాన సూర్యారావు, పామర్తి వెంకటరమణయ్య, మిద్దె ఆదినారాయణ, భాస్కర్, తుమ్మల చెంగయ్య, మట్ట మంగ రాజు పాల్గొన్నారు.

## బీసీ జనగణన కోసం ధర్నాచేస్తే అరెస్ట్ చేస్తారా..?



**పులివెందుల, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఈ నెల 27న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు ఆధ్వర్యంలో గుంటూరు పట్టణంలో బీసీల జనగణనతోపాటు, ఎన్నికల ప్రచారం లో ఇచ్చిన హామీ మేరకు బీసీల రక్షణ చట్టాన్ని సైతం వెంటనే చేపట్టాలని శాంతియుతంగా ధర్నాచేస్తున్న వారిని అరెస్టు చేయడం పాశివిక చర్య అని కడప జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు తీవ్రంగా ఖండించారు. కడప నగరంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడటంలో బీసీల పాత్ర మరచి పోవద్దని వారు కూటమి నాయకు లకు గుర్తుచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే బీసీల జనగణన జరిపి వారికి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని వారు తెలిపారు. బీసీల జనగణన, రక్షణచట్టం కొరకు తమ నాయకులు చేస్తున్న పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, గౌరవ అధ్యక్షులు పి.గురు స్వామి, రాజకీయ విభాగం అధ్యక్షులు రామాంజ నేయులు, త్రివిక్రమ యాదవ్, కళ్యా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా క్రాఫ్ హాలిడేకు సహకరించండి : గాంధీ రాజు



**పాలకొల్లు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఆక్వా సాగును క్రాఫ్ హాలిడే ప్రకటించి రైతులందరూ సహ కరించాలని, జై భారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు కోరారు. మంగళవారం జై భారత్ క్షీర రామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో పెనుమ ంట్ర గ్రామంలో పంట విరామం నిమిత్తం ఆక్వా రైతుల అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఆయన మాట్లాడుతూ రొయ్య మద్దతు ధర లభించే వరకు, ఆక్వా రైతులకు మేలు జరిగే వరకు తమ పోరాటం ఆగదని రైతులు గమనించి సహకరించాలని కోరారు. ఈ సదస్సులో ఆల మూరు, జుత్తిగ, మల్లిపూడి, నత్తా రామేశ్వరం ఆక్వా రైతులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## కడుమూరు లక్ష్మీదేవి నేత్రదానం




**పులివెందుల, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పట్టణంలోని కదిరి రోడ్ లోని నాగయ్య ఆశ్రమంలో నివాసం ఉంటున్న కడుమూరు లక్ష్మీదేవి (50) మంగళవారం మరణించడంతో ఆశ్రమం నిర్వాహ కులు రమాదేవి, అంధుల ఆశ్రమం నిర్వాహకులు రామ్ మోహన్, వెంకటేష్, వెంకటమ్మ, గంగ మ్మలు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవ సమితి అధ్యక్షులు రాజులకు సమాచారం ఇవ్వడంతో టెక్నీషియన్ హరీశ్‌తో కలిసి అంధుల ఆశ్ర మం వెళ్ళి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లా డుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలను దానం చేసి అంధత్వంతో బాధ పడుతున్న అంధులకు చూపు ఇచ్చే బృహత్తర్యం కోసం కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన 7093204537 లేదా 9966509364 లకు సమాచారం ఇచ్చి అంధరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సంద ర్భంగా ఆశ్రమం నిర్వాహకులకు సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహ స్లాబ్‌కు ధర్మారావు ఫౌండేషన్ వితరణ



**పాలకొల్లు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పోడూరు మండలం పెనుమదం గ్రామ పెదపేట కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ స్లాబ్ నిర్మాణం నిమిత్తం ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 సిమెంట్ బస్తాలను సహాయంగా అందజేశారు. పెనుమదం పెదపేట కాలనీ పెద్దలు మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లి సహాయం అందించాలని కోరారు. స్థానిక పెద్దల వినతి మేరకు మంగళవారం ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత పెద్దలు మంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రావూరి అప్పారావు, పీతల శ్రీను, మేడిశెట్టి కేశవ, పెనుమదం గ్రామ సర్పంచ్ తానేటి బాబూరావు, ఎంపీటీసీ మానేపల్లి శ్రీధర్, గ్రామ కూటమి నాయకులు దేవరపు దొరబాబు, కడలి అంజనేయులు, బోను పాముల నాగరాజు, గెద్దాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయ వేసవి శిబిరాల్లో విద్యార్థులకు శిక్షణ



**దెందులూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** గ్రంథాలయాల్లో విద్యార్థులకు శిక్షణా తరగతులు మెలకు వలు అందించడం ద్వారా విద్యార్థులు తమ చదువులను మరింత మెరుగుపరచుకోవడానికి, నైపు ణ్యాలను పెంచుకోవడానికి ఉపయోగపడతాయని పోతునూరు గ్రంథాలయ అధికారి గురిందపల్లి రాంబాబు అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా పోతునూరు శాఖ గ్రంథాలయంలో రెండవ రోజు వివిధ స్కూల్ నుండి 16 మంది విద్యార్థులు విచ్చేశారు. మొదటిగా చదవడం, రాయించడం తదు పరి నీతి కథలు చెప్పడం, పద్యాలు చెప్పడం, చదరంగం ఆడించడం, క్యారంబోర్డ్స్ ఆడించడం వంటివి నేర్పించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమం రిసోర్స్ పర్సన్ ఎల్.యేసయ్య, గ్రంథ పాలకులు గురిందపల్లి రాంబాబు పర్యవేక్షణలో జరిగాయి.

## శ్రీశైలమల్లన్న రాబడి రూ.3.61 కోట్లు

- 105గ్రాముల 400 మిల్లిగ్రాముల బంగారం, 4కేజీల860 గ్రాముల వెండి
- ఉభయ దేవాలయాల హుండీల లెక్కింపులో 28 రోజులలో భక్తులు సమర్పించిన కానుకలు



**శ్రీశైలం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉభయ దేవాలయాల హుండీల లెక్కింపు చంద్రావతి కల్యాణమండపంలో మంగళవారం ఉదయం నుండి ప్రారంభించగా రూ.3,61,42,016లు నగదు రాబడి లభించిందని, అదేవిధంగా 105గ్రాముల400 మిల్లిగ్రాముల బంగారం, 4 కేజీల 860 గ్రాముల వెండితో పాటు వివిధ విదేశీ కరెన్సీ కూడా లభించినట్లు కార్య నిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మొత్తం భక్తులు కానుకల రూపేణా స్వామి అమ్మవార్లకు సమర్పించుకుందని ఈ మొత్తం 28 రోజులలో సమకూరిందని కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు మధ్య సీసీ కెమెరాల నిఘాతో లెక్కింపును నిర్వహించారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అన్ని విభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, శివసేవకులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యం, పట్టుదలతో దేనినైనా సాధించవచ్చు..

**పీఎం కేర్ బాల బాలికల ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**



**ఏలూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఉన్నత లక్ష్యం, పట్టుదలతో దేనినైనా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో కోవిడ్-19 మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలలు పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ స్కీమ్‌లో ఉన్న లబ్దిదారులతో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లాలో ఉన్న 26 మంది బాలబాలికలకు గార్డియన్‌గా ఉన్న కలెక్టర్ ఆ పిల్లలతో మమేకమై బాలబాలికల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వారు చదువుతున్న పరిస్థితి విషయాలు తెలుసుకుని సమాజంలో ఉన్న పరిస్థితిని బట్టి పోటీతత్వంతో చదువుతూ ముందుకు వెళ్లి మీరు ఏదైతే లక్ష్యం ఏర్పరచుకు న్నారో ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఆ లక్ష్యాల వైపు అడుగులు వేయాలని హితవు పలికారు. అదేవిధంగా బాల బాలికలందరూ వారు చేరుకోవాల్సిన లక్ష్యాలపై దిశా నిర్దేశం చేశారు. సాధించ గలమనే పట్టుదల ఉంటే ఏదైనా సాధిస్తామన్నారు. బాల బాలికలు అందరికీ ఉన్నత చదువులు చది విన ప్రతి ఒక్కరికి అందవలసిన ఫలాలను ప్రభుత్వం తరపున అందేలా చూస్తామని భరోసా కల్పిం చారు. ఈ సందర్భంగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆకాష్ పరీక్షలో తప్పిన ఒక సబ్జెక్టుకు సప్లమెంటరీ పరీక్ష రాయించి రిజల్స్ వచ్చిన తర్వాత అప్ డేట్ చేయాలని డీసీపీఓకు సూచించారు. పదోతరగతిలో ఒక సబ్జెక్ ఫెయిల్ అయిన అజేయ్ ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. 18 సంవత్స రాలు వయస్సు నిండి వివాహం చేసుకున్న ఇద్దరు యువతులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆశీర్వదించారు. వట్లూరుకు చెందిన మరో యువతి చంద్రికకు మే 7న వివాహం నిర్ణయించగా వారు కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక ఇవ్వగా తప్పకుండా హాజరవుతానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో 18 సంవత్స రాలు నిండిన ఇద్దరు బాలబాలికలకు 10 లక్షలు డిపాజిట్ అయిన పోస్టల్ ఎకౌంట్స్ సంబంధించిన పాస్ పుస్తకాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్. సూర్య చక్రవేణి, అసిస్టెంట్ సూపర్డెంట్ పోస్టల్ డిపార్ట్మెంట్ డి. శ్రీనివాస్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎన్.జితేంద్ర బాబు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఎల్‌డిఎం డి.నీలాద్రి, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, వయోజన విద్యా అధికారి జి.రాధాకృష్ణ, డీసీపీ యు సిబ్బంది ఇన్స్టిట్యూషనల్ కేర్ ఆఫీసర్ సిహెచ్.శ్రీకాంత్, లీగల్ ఆఫీసర్ సి.జాహ్నవి బాలస్వామి, రాజేష్, రాజకుమార్, సునీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం రాకతో గ్రామాల అభివృద్ధి శరవేగం



**దెందులూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం రాకతో నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి శరవేగంగా సాగుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలం పినకడిమి గ్రామంలో రూ.45 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు, సీసీ రోడ్లకు రోడ్డు పనులకు సోమవారం ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో రహదారులన్నీ ఎంతో దుర్భరంగా తయారయ్యాయని, ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలందరి ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టడంతో పాటు, నియో జకవర్గంలో భారీ స్థాయిలో నూతన రోడ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న పలు రహదారులు నిర్మాణ పనులను, మరమ్మత్తు పనులను కూడా చేపట్టి పూర్తి చేసినట్లు తెలి పారు. పినకడిమి గ్రామంలో చేపట్టిన రహదారి నిర్మాణ పనులు సుమారు నెల రోజుల్లో త్వరితగతిన పూర్తయ్యేలాగా కూడా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు ఆత్మకూరు పర్యటనను అడ్డుకుంటాం

**ఆర్పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్కే మాబు**



**నెల్లూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** సీఎం చంద్రబాబు 2024 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు పరిచి పర్యటనలకు రావాలని ఆర్పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్ కే మాబు డిమాండ్ చేశారు. మం గళవారం నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఉన్న పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు గత ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలు అమలుపరిచి పర్యటన కార్యక్రమాలు జరుపుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు హామీలు అమలు చేయకుండా పర్యటనలు పేరుతో ప్రజల్లో తిరగడం మీకు మొహం ఎలా చెల్లుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకం అమలు ఆర్టీసీ బస్సు ల్లో మహిళలకు ఉచితమన్నారు. ప్రస్తుతం ఏ పథకం అమలు కాలేదన్నారు. పేదల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వమన్నారు.. మరి కూటమి ప్రభు త్వంలో ఉండే నాయకులు సంక్షేమం కోసం ప్రజాధనాన్ని సహజ వనురులని దోచుకునే పనిలో నిమ గ్నమయ్యారన్నారు. పేదలకు ఎన్నిక ల్లో ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఆయా నియోజకవర్గాల్లో పేద ప్రజల సమస్యల ను పట్టించుకోకుండా ఆదాయం పర్సంటేజీలు వచ్చే పనుల్లో ఉన్న శ్రద్ధ పేద, దళితులు, సమస్యలు వారికి పట్టవన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాస్వా మ్యంలో పర్యటనలు జరుపుకో వాలన్నారు. హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్పీఐ పార్టీ ఆధ్వర్యంలో మీ పర్యటనలు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుంపల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

## వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల మేధస్సును పెంపొందిస్తుంది

**గ్రంథాలయ అధికారి దుగ్గి పోగు జాన్ బాబు**



**పెదపాడు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల మేధస్సును పెంపొందిస్తుందని పెదపాడు గ్రంథాలయ శాఖా అధికారి దుగ్గి పొగు జాన్ బాబు అన్నారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో భాగంగా వేసవి విజ్ఞాన శిబిరంలోని రెండవ రోజు మంగళవారం విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్ చే స్పోకెన్ ఇంగ్లీష్ బోధి ంచి, దానిలోని మెలుకువలు నేర్పించారు. తదుపరి విద్యార్థులచే కథలు చదివించడం, కథలు చెప్పిం చడం వంటివి చేశారు. ఈ కార్యక్రమంలో 26 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్నాక్స్ పంచిపెట్టారు. ఈ కార్యక్రమం గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో జరిగాయి.

## రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడాలనుకునే వారికి బుద్ధి చెప్పేలా

# పీఎం మోదీకి స్వాగతం చెబుదాం

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఇబ్రహీంపట్నం ఎం.వి.ఆర్ హాల్‌లో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులతో సన్నాహక సమావేశం
- ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎంపీ కేశినేని శివనాథ్, చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత, ఎమ్మెల్యే వసంత
- రాజధాని అమరావతి వల్ల అభివృద్ధి చెందే నియోజకవర్గాల్లో మైలవరం ఒకటి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక రాష్ట్రానికి ఒక పండుగ
- రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న మోదీకి స్వాగతం పలికేందుకు స్వచ్ఛందంగా తరలిరానున్న ప్రజలు
- మైలవరం నియోజకవర్గం నుంచి 50 వేలకు మించి వస్తారని అంచనా
- వారందరికీ భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించిన ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే వసంత



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం నిలిపివేసి, రాష్ట్రాభివృద్ధితో పాటు పరిశ్రమలు రాకుండా చేసిన సైకో అండ్ బ్యాచ్ మరోసారి రాష్ట్ర రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా కొత్త డ్రామాలు మొదలుపెట్టారు. ఇటీవల ప్రపంచ బ్యాంక్‌కి మునిగిపోయే ప్రాంతానికి నిధులు ఇవ్వొద్దంటూ లేటర్ రాశారు. ఇలాంటి సైకో, దుర్మార్గులు, గజదొంగలకి బుద్ధి చెప్పేలా అమరావతి రాజధాని పునర్మిర్మాణ పనుల శంకుస్థాపనకి విచ్చేయచున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి దేశ చరిత్రలో ఇప్పటివరకు లేని విధంగా ఘన స్వాగతం చెబుదామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. రాష్ట్రానికి మోదీ రాక ఒక పండుగ లాంటిదన్నారు. ఇబ్రహీంపట్నంలోని ఎమ్.వి.ఆర్ ఫంక్షన్‌లో ఎన్డీయే కూటమి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, ఎమ్మెల్యేలు వసంత కృష్ణ ప్రసాద్, అయితాబత్తుల ఆనందరావుతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొన్నారు. ముందుగా నాయకులందరూ కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సభకు ఎమ్మెల్యే వసంతవెంకట కృష్ణ ప్రసాద్ సభాధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో సహకరిస్తోందన్నారు. పోలవరం, రాజధాని అమరావతి, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు, విశాఖ పరిశ్రమకు ఆర్థిక సాయం, రైల్వే జోన్ ఇలా ఎన్నో అభివృద్ధి పనులకు పీఎం నరేంద్రమోడి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అమరావతి అభివృద్ధి చెందితే, మైలవరం నియోజకవర్గానికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏపీకి ఎంతో మేలు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీకి మైలవరం పెట్టనికోటన్నారు. నియోజక వర్గం నుంచి మోడి పర్యటనకు 25 వేల మంది తరలిరావడం ఖాయమని ఎంపీ తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సహకారం అందిస్తున్న ప్రధానమంత్రి మోదీకి స్వాగతం పలికేందుకు ప్రజలందరూ స్వచ్ఛందంగా తరలి రావటానికి సిద్దంగా వున్నారన్నారు. వీరందరికి కావాల్సిన ఏర్పాట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌తో కలిసి చేయటం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదగా లక్షల కోట్ల రూపాయల విలువ గల అమరావతి రాజధాని పునర్మిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనుందన్నారు.

**ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు రైల్వే స్టేషన్లు :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డబుల్ ఇంజన్ సర్కార్‌లో ప్రధాన మంత్రి మోదీ రాష్ట్రాభివృద్ది ఎన్నో విధాలుగా సహకారం అందిస్తున్నారని, అమరావతికి రూ.15 వేల కోట్లు గ్రాంటుగా ఇచ్చారని తెలిపారు. అలాగే అమరావతి నుంచి కొత్తగా రైల్వే లైన్ వేశారు. అది కూడా ముఖ్యంగా పరిటాల ప్రాంతం నుంచి వెళ్లి తెలంగాణ ప్రాంతంలో కలుస్తుంది. అమరావతికి ఒక రైల్వే స్టేషన్ వస్తే ఎన్టీఆర్ జిల్లాలో నాలుగు రైల్వే స్టేషన్స్ వస్తున్నాయన్నారు.

**మూలపాడులో స్పోర్ట్స్ సిటీ-వెస్ట్ బైపాస్‌లో రైతుల సమస్య పరిష్కారం :**

నదికి అటువైపు అమరావతి వుంటే ఇటువైపు మైలవరం నియోజకవర్గం. రాజధాని అమరావతి వల్ల అత్యంత అభివృద్ధి చెందే నియోజకవర్గాల్లో మైలవరం నియోజకవర్గం ఒకటన్నారు. మూలపాడు సమీపంలోని చుట్టుపక్కల నాలుగు గ్రామాల్లో అమరావతి స్పోర్ట్స్ సిటీ, స్పోర్ట్స్ యూనివర్శిటీ నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశ మొత్తానికి ఇక్కడ నుంచే క్రీడాకారులు, కోచ్‌లు, సపోర్ట్ స్టాప్, ఫిజియోథెరపిస్టులు తయారు అయ్యే విధంగా స్పోర్ట్స్ యూనివర్శిటీ వుండబోతుందన్నారు. అదే విధంగా వెస్ట్ బైపాస్ నిర్మాణ విషయంలో టవర్ లైన్ ఏర్పాటు విషయంలో ఇబ్బంది పడుతున్న 284 మంది రైతుల సమస్య మంత్రి నారా లోకేష్ చొరవతో పరిష్కారం అయిందన్నారు. ఒక రైతు కూడా భూమి కోల్పోకుండా టవర్ లైన్ నిర్మాణం జరగాలని ఆదేశించి 45 ఎకరాలు భూమి రైతులు కోల్పోకుండా కాపాడారని కొనియాడారు.

**గ్రేటర్ అమరావతి :**

ఇటీవల సీఎం చంద్రబాబుతో కొండపల్లి మున్సిపాలిటీ నుంచి కంకిపాడు వరకు కలిపి విజయవాడను గ్రేటర్ విజయవాడగా చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రేటర్ విజయవాడ కాదు గ్రేటర్ అమరావతి చేయనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపినట్లు పేర్కొన్నారు. గ్రేటర్ అమరావతి లో రెండు కార్పొరేషన్లు ఉంటాయని. ఒకటి విజయవాడ కార్పొరేషన్ కాగా, రెండోది అమరావతి కార్పొరేషన్ అన్నారు. అమరావతి కార్పొరేషన్‌లో గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి వుంటాయి. ఈ రెండు కలిపితేనే గ్రేటర్ అమరావతి అవుతుందన్నారు. త్వరలోనే ఆ ఈ ప్రాంతం గ్రేటర్ అమరావతి కానుందన్నారు.

**టీడీపీలో గ్రూపుల్లేవ్ :**

ప్రజలు తమ తీర్పుతో సైకో అండ్ బ్యాచ్‌కి బుద్ధి చెప్పినా వారి తీరు మారలేదన్నారు. బ్లూమీడియాను అడ్డుపెట్టుకుని రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా పిచ్చి పిచ్చి రాతలు రాస్తుందని మండిపడ్డారు. తనకు, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు మధ్య వివాదం ఉందని బ్లూ మీడియాలో ఎర్రి రాతలు రాస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని మండిపడ్డారు. తమ మధ్య ఎటువంటి గ్రూపుల్లేవని, ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, మే రెండో తేదీన లక్ష కోట్ల రూపాయలతో చేపట్టనున్న అమరావతి రాజధాని పనులకు ప్రధాన మంత్రి నరేంద్రమోడి చేతుల మీదుగా శ్రీకారం చుడుతున్నామన్నారు. రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్రమోడికి ఘన స్వాగత పలుకుదామని మంత్రి సవిత పిలుపునిచ్చారు. మైలవరం నియోజక వర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ప్రధాని పర్యటనను విజయం చేయాలన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఏపీలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోడి అండదండలు అందిస్తున్నారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతి రాజధాని అని అన్నారు. రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారమందిస్తోందన్నారు. 2014 రాష్ట్ర విభజన తరవాత ఏపీ రాజధాని లేకుండా అయిపోయిందన్నారు. అమరావతి ప్రాంత రైతులు ల్యాండ్ పూలింగ్ ద్వారా 34 వేల ఎకరాలు రాజధాని కోసం ఇచ్చారని, వారి త్యాగం మరువలేనిదని ధన్యవాదాలు తెలిపారు. ఆనాడు అమరావతి నిర్మాణానికి అసెంబ్లీ సాక్షిగా అంగీకరించిన జగన్... తరవాత పనులను అడ్డుకున్నారన్నారు. జగన్ అయిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించాడన్నారు. ఆయన అసమర్థ పాలనతో విసిగివేశారని ప్రజలు...సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి జై కొట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడి సహకారంతో రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఏపీపై ప్రధాని నరేంద్రమోడి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఆయన సహకారంతో అమరావతి రాజధాని పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. ఈ నెల రెండో తేదీన అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి పీఎం నరేంద్రమోడి రాష్ట్రానికి వస్తున్నారన్నారు. ఆయనకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలకాలన్నారు. ఇందుకోసం మైలవరం నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో కూటమి నాయకులు, ప్రజలు తరలిరావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రాజధానికి చేరుకోవటానికి వెస్ట్ బైపాస్ నిర్మాణం వల్ల చాలా అతి తక్కువ సమయం పడుతుందన్నారు. అమరావతి నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే ఖమ్మం వరకు పూర్తి అయిందని, అతి కొద్ది కాలంలోనే ఈ జాతీయ రహదారి అందుబాటులోకి వస్తుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు కూడా మైలవరం నియోజకవర్గంలో ఉందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారు కూటమి ప్రభుత్వం హయంలోనే ఔటర్ రింగ్ రోడ్డు కూడా పూర్తవుతుందన్నారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ మన మైలవరం నియోజకవర్గంలో ఏర్పాటు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసీఆర్ శివనాథ్ (చిన్ని) కూడా విశేషంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మూలపాడు నుంచి అమరావతికి కూడా కృష్ణానదిపై ఐకానిక్ వంతెన పూర్తి అయితే హైదరాబాద్ నుండి అమరావతిని చేరుకోవటానికి చాలా తక్కువ సమయం పడుతుందన్నారు. ఎర్రుపాలెం నుంచి అమరావతికి రైల్వే అని పూర్తయితే మన ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇందుకు భూసేకరణ కూడా నోటిఫికేషన్ ఇచ్చారని, దాములూరు మీదుగా అమరావతికి ఈ రైల్వే లైను ఉంటుందన్నారు. ఒక్క మన మైలవరం నియోజకవర్గంలోనే ఇన్ని అభివృద్ధి పనులు మన కళ్ళముందు సాక్షాత్కరిస్తున్నాయంటే దీన్నిబట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోతోముఖాభివృద్ధికి మైలవరం ఒక మణిహారం కాబోతుందన్నారు. ఇవన్నీ అభివృద్ధి పనులు పూర్తయితే మన మైలవరం నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందన్నారు. ఇక్కడ ప్రజలకు విద్య, ఉపాధి అవకాశాలు మరింత మెరుగ్గా ఉంటాయన్నారు. దీనివల్ల సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. గత ఒక వైసీపీ ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. వైసీపీ అనే మొక్కకు చిగుర్లు రావడం కూడా ఈ ప్రాంతానికి పెను శాపం అన్నారు. ఎందుకంటే గతంలో సీఎం చంద్రబాబు 2014-19 వరకు చేసిన అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అడ్డుకుందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ రెడ్డి కృష్ణ, గుంటూరు జిల్లాల అభివృద్ధిని పూర్తిగా వ్యతిరేకించారన్నారు. ఈ ప్రాంతాలకు పరిశ్రమలు రాకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి విద్వేష పూరిత చర్యల వల్ల ఈ రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా వెనకబడిపోయిందన్నారు. మూడు రాజధానులు అనే పేరుతో జగన్ రెడ్డి అమరావతి గొంతు నొక్కేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర భవిష్యత్తు, మన బిడ్డల భవిష్యత్తు, ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే 2029లో కూడా కూటమి సర్కారు గెలుపు అవశ్యమన్నారు. 2029లో వైసీపీని సమూలంగా సమాధి చేస్తే తప్ప ఈ ప్రాంతానికి విముక్తి లేదన్నారు. ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతిని సాకారం చేసుకుని మన రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు. మనకు ఇరుగు, పొరుగు రాష్ట్రాలు కూడా ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర మహానగరాలను అభివృద్ధి చేసి వాటి నుంచి భారీగా ఆదాయం పొందుతున్నాయని పేర్కొన్నారు. ఇదే తరహాలో ఏపీ రాజధాని అమరావతి కూడా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు దృఢనిశ్చయం, అమరావతి రైతుల త్యాగఫలం, ప్రజల ఆకాంక్షతో ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరుగుతోందన్నారు. దీనికి ప్రధాని మోదీ గారు రావడం శుభపరిణామమన్నారు. ఇది మా రాజధాని అని ప్రజలు గర్వంగా చెప్పుకునేలా అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. మే 2న అమరావతిలో రూ.లక్ష కోట్లకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. రాజధాని అమరావతిలో పనుల పునఃప్రారంభానికి సూచికగా ప్రధాని మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారన్నారు. వెలగపూడి సచివాలయం వెనుక 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రాజధాని పనుల పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీని అత్యద్భుతంగా స్వాగతించాలని పిలుపునిచ్చారు. అమరావతితో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. ఎన్డీఏ కూటమి శ్రేణులు, బీజేపీ, తెలుగుదేశం, జనసేన, పార్టీ కుటుంబ సభ్యులు, అందరి భాగస్వామ్యంతో అమరావతి రాజధాని పనుల పునఃప్రారంభం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్న వారికి ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అమరావతిని చంద్రబాబు నాయుడు అకుంఠిత దీక్ష పట్టుదలతో ఒక మహానగరం నిర్మించాలని ప్రయత్నిస్తున్నారు. ఆ మహానగరం భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని మహా నగరాల కంటే గొప్ప వుండాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ముందుకి వెళుతున్నారు. మే 2న ప్రధాన మంత్రి మోదీకి రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు వేలాదిగా తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు, మైలవరం నియోజకవర్గ పరిశీలకులు దారునాయక్, కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు చిట్టూకుదురు శ్రీనివాసరావు, మైలవరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ నూతలపాటి బాల కోటేశ్వరరావు, జనసేన నాయకులు చెరుకుపల్లి సురేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు ఉయ్యూరు వెంకట నరసింహరావు, టీడీపీ పార్లమెంటర్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెన్నబోయిన చిట్టిబాబు, గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా శ్రీను, ఇబ్రహీంపట్నం మండల పార్టీ అధ్యక్షుడు రామినేని రాజా, జి.కొండూరు మండలపార్టీ అధ్యక్షుడు పజ్జూరి రవికుమార్ (వెంకట్), రెడ్డిగూడెం మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం


**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి**



**నెల్లూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** రూరల్ నియోజకవర్గ పరిధిలోని సౌత్ మోపూర్ గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో సౌత్ మోపూర్ గ్రామ జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు మంగళవారం మండల పరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సౌత్ మోపూర్ గ్రామంలో ఇప్పటికే దాదాపు రూ.కోటి 30 లక్షలతో అభివృద్ధి చేయడం జరిగిందని, రాబోవు రోజుల్లో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రూరల్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని. ఇందుకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, టీడీపీ నాయకులు రాపూరు శేఖర్, ఉప సర్పంచ్ సల్లా నరసయ్య, టీడీపీ నాయకులు భాస్కర్, అన్నం సుధాకర్ గౌడ్, ఆరెడ్డుల మణి, హైస్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ తుళ్లూరు పెంచలయ్య, నీటి సంఘం అధ్యక్షుడు తుళ్లూరు రామయ్య, నీటి సంఘం ఉపాధ్యక్షులు కండే అశోక్, టీడీపీ నాయకులు చీమల సుధాకర్, పెళ్లూరు రవీంద్ర, పముజుల గోపాలయ్య, దేరంగుల వెంకటేశ్వర్లు, బట్ట కార్తీక్, ఉంటా శివయ్య, పడవల మురళి, పముజుల సతీష్, శివ, పారుతూరి వెంకయ్య, పనేం సునీల్, మందల మస్తానయ్య, బండ్ల గోపాలయ్య, అనిల్, రాపూరు ప్రశాంత్, చల్లా చైతన్య, సాదేపల్లి విజయ భరత్, తిప్పన కామాక్షయ్య, జి. శేఖర్ సుమంతు, బండి వెంకట రమణ, పులికొండ గిరి, తరకాల కృష్ణయ్య, రాపూరు రవికుమార్, ఎస్.కె. రసూల్, శ్రీహరి, తురక తేజ, మన్నవరపు నరసయ్య, మన్నవరపు సుధాకర్, పెంచలయ్య, బిరుదులు పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిలో ప్రధాని మోదీ సభను విజయవంతం చేయండి

**పిలుపునిచ్చిన ఏలూరు జిల్లా ఇంచార్జీ మంత్రి నాదెండ్ల మనోహర్**



**ఏలూరు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్నిర్మానం కోసం శంకుస్థాపన చేయడానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా నాయకులతో మంగళవారం మోదీ పర్యటన నిమిత్తం సభను విజయవంతం చేయాలని దిశా నిర్దేశించారు. అనంతరం రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ మే రెండో తేదీన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃర్నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమానికి హాజరవుతున్న మోదీ సభను ప్రజలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. అమరావతి రైతులు రాజధాని నిర్మాణం కోసం 34 వేల ఎకరాలు ఇస్తే,గత వైసిపి ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తూ మూడు రాజధానులు అంటూ నాటకాలు ఆడిందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మోదీ సభను విజయవంతం చేయాలని కోరారని తెలిపారు. ఏలూరు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అక్కడికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్లధర్మరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్నీ వీరాంజనేయులు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు, దెందులూరు జనసేన సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, నూజివీడు జనసేన ఇంచార్జ్ బర్మా ఫణి బాబు, వివిధ హోదాల్లో ఉన్న జనసేన, టీడీపీ, బీజేపీలకు చెందిన ఉమ్మడి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అధిక వేలానికి శ్రీ పంచాయతన సీతారామ చంద్రమూర్తి దేవస్థానం భూములు



**శంఖవరం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** మండలంలోని ఎస్ జగ్గంపేటలోని పురాతన ఆలయంగా పేరుగాంచిన శ్రీ పంచాయతన సీతారామ చంద్రమూర్తి స్వామి వారి దేవస్థానానికి చెందిన భూముల కౌలుకు నిర్వహించిన వేలంలో అధిక ఆదాయం సమకూరడంతో దేవాదాయ శాఖ అధికారులు, దేవస్థానం పాలక వర్గం హర్షం వ్యక్తం చేసారు. స్వామి వారి ఆలయ ఆవరణలో పిఠాపురం గ్రూపు 4 దేవాలయాల కార్యనిర్వహణాధికారి జి అశ్విని, ఆలయ వంశపారంపర్య ఛైర్మన్ మోగంటి తిరుపతిరాజు ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ పి రాజబాబు భూముల వేలం నిర్వహించారు. ఎస్ జగ్గంపేటలోని సర్వే నెం. 78/2లో గల య.3.32ట్లు భూమికి గడిచిన మూడేళ్ళ కాలానికి ఏడాదికి రూ.56 వేలు ఉండగా, ప్రస్తుతం రాబోయే మూడేళ్ళ కాలానికి ఏడాదికి రూ.లక్ష 16వేలు చొప్పున శంఖవరం గ్రామానికి చెందిన బైరా రాంబాబు దక్కించుకున్నారు. సర్వే నెం. 24/1లో య.6.09ట్లు మెరక భూమికి మూడేళ్ళ కాలానికి నిర్వహించిన వేలంలో ఏడాదికి రూ.10,500ల చొప్పున శంఖవరం గ్రామానికి చెందిన గవరసాని కృష్ణ దక్కించుకున్నారు. ఈ దేవస్థానానికి రౌతులపూడి మండలం గుమ్మరేగుల గ్రామంలో సర్వే నెం.55లో గల య.10.45ట్లు భూమికి మూడేళ్ళ కాలానికి గతంలో ఏడాదికి రూ.లక్ష55 వేలు ఉండగా, ప్రస్తుతం ఏడాదికి రూ.3లక్షల 60వేలు చొప్పున మూడేళ్ళ కాలానికి ఆదాయం సమకూరింది. ఈ ప్రాంతంలో ఇటీవల సరుగుడు తోటల భూమ్ అధికంగా ఉండడం వల్లే స్వామి వారికి ఎన్నడూ లేని విధంగా, కనివినీ ఎరుగని రీతిలో ఆదాయం సమకూరిందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోగంటి మురళీకృష్ణ, టీడీపీ సీనియర్ నేత ఓలేటి లక్ష్మీనారాయణ, శంఖవరం, ఎస్ జగ్గంపేట గ్రామాల రైతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సాక్షి రాతలు అబద్ధాలు అని తేలితే వారి ముక్కు నేలకు రాయాలి

**- చంద్రబాబు ఫోటోను వారి ఆఫీసులో పెట్టుకుని పాలాభిషేకం చేసి ఆయన ఫోటోకు దండం పెట్టాలి**

**- మేము ఏమి చేసినా చట్టబద్ధంగా చేశాం**

**- విశాఖ సెజ్‌లో ఎకరా కోటి చొప్పున, కాపులుప్పలపాడులో ఎకరా రూ.50 లక్షల చొప్పున అక్కడ ఉన్న రేటు ప్రకారం ఉర్సాకు కేటాయించాం**

**- ప్రజలు వైసీపీని చెప్పుతో కొట్టి 11 సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదు**

**- పౌరుషం ఉంటే మా ఛాలెంజ్ ను స్వీకరించాలి**

**మంగళగిరి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ఉర్సాకు భూ కేటాయింపులపై సాక్షిలో రాతలు అబద్ధాలని తేలితే వారి ముక్కు నేలకు రాయాలని.. సాక్షి ఆఫీసులో చంద్రబాబు ఫోటో పెట్టుకొని పాలాభిషేకం చేసి ఆయన ఫోటోకు దండం పెట్టాలని మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు డిమాండ్ చేశారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరుషం ఉంటే తమ ఛాలెంజ్‌ను స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రజలు వైసీపీని చెప్పుతో కొట్టి 11 సీట్లకు పరిమితం చేసి బుద్ధి చెప్పినా వారిలో మార్పు లేదు.. వారు ఇక మారరు. మేము ఏం చేసినా చట్టబద్ధంగా చేశాం. సాహేతికమైన విమర్శలు ఉంటే మేము ఒప్పుకుంటాం కాని అబద్దాలను కాదు. వైసీపీ నేతలు అసెంబ్లీకు రావడానికి దమ్ములేక నీచ పత్రిక పెట్టుకుని తప్పుడు రాతలు రాయిస్తున్నారు. ఆ తప్పుడు పత్రికను మూయించడం మాకు పెద్ద సమస్య కాదు. మేము ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్తున్నాం.. ప్రజా సంక్షేమం అభివృద్ధే మా లక్ష్యం. బ్లూ మీడియా పగలును రాత్రి రాత్రిని పగలును చేసే ప్రయత్నం చేస్తుంది. సాక్షికి టీడీపీని ద్వేశించడం, దూసించడం తప్ప మరొకటి తెలియదు. అభివృద్ధి వినాశకులు ఎవరో.. అభివృద్ధి కాముకులు ఎవరో ప్రజలే గమనించాలి. ఏపీలో ఐటీని డవలప్ చేయడానికి విశాఖలో సెజ్ ఏర్పాటు చేసి అక్కడికి అన్ని కంపెనీలను ఆహ్వానించడం జరిగింది. జగన్ రెడ్డికి పరిపాలన, డవలప్ మెంట్ అంటే ఏంటో తెలియదు కాబట్టి ఇది విచిత్రంగా ఉంటుంది. 70 వేల కోట్లు పెట్టుబడితో డేటా సెంటర్‌ను పెడతామన్న అదాని, లులూ గ్రూప్‌లను తరిమేసి నేడు పెట్టుబడులపై అబద్దాలు ప్రచారం చేయడానికి సిగ్గనిపించడం లేదా? ఉర్సాకు భూ కేటాయింపులపై 99 పైసలకే ఇచ్చారంటూ తప్పుడు రాతలు రాస్తున్నారు. అబద్దాలు ప్రచారం చేస్తున్న మీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఇండస్ట్రీ పాలసీలో కొన్ని కంపెనీలకు రాయితీలు ఇవాల్సి ఉంటుంది. భారత దేశంలో నేడు చిప్ మేకింగ్ లేదు. మోదీ గవర్నమెంట్ వచ్చాక దాదాపు రూ. లక్షా 50 వేల కోట్లతో సెమీ కండక్టర్ ఇండస్ట్రీ పెట్టేందుకు కంపెనీలకు ఏమి కావాలంటే వాటిని ఆ ప్రభుత్వాలు సమకూరుస్తున్నాయి. అవసరమైతే భారత్ నుండి చిప్స్ ఎక్స్ పోర్ట్ చేసేందకు మోదీ పనిచేస్తున్నారు. అదే కోవలో ఏపీకి కంపెనీలను తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధికి కేంద్రంగా మార్చేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తుంటే ఓర్వలేక విషం చిమ్ముతున్నారు. జగన్ రెడ్డి ఐదేళ్లలో సాధించలేని విజయాలను, తీసుకురాలేనన్ని పెట్టుబడులను కూటమి ప్రభుత్వం తీసుకురావడం చూసి ఓర్వలేని జగన్ రెడ్డి ముఠా విదేశీ పెట్టుబడులను తరిమేయడమే పనిగా పెట్టుకుంది. మాతృభూమిపై అభిమానంతో, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో విశాఖలో ఏఐ, ఐటీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన ఉర్సా క్లస్టర్స్ కంపెనీపై జగన్ రెడ్డి అండ్ కో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ స్థాయి డేటా సెంటర్, ఏఐ అభివృద్ధి ద్వారా ఏపీలో ఉన్నత ప్రమాణాల ఉద్యోగాలు సృష్టించి రాష్ట్ర ఆర్థికస్థితిని అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ఉర్సా క్లస్టర్స్ ముందుకొచ్చింది. దేశవ్యాప్తంగా ఎన్నో రాష్ట్రాలు పెట్టుబడులు పెట్టమని ఆహ్వానించినా కాదని తెలుగు యువతకు ఉద్యోగాలు కల్పించాలనే సదుద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉర్సా సంస్థ ముందుకొచ్చింది. ప్రస్తుతం ఏపీలో అమలవుతున్న పీ3 పాలసీకి ఆకర్షితులై రూ.5,728 కోట్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్‌ను పెట్టేందుకు ఉర్సా సంస్థ సిద్ధమైంది. ఏప్రిల్ 15న ఉర్సా క్లస్టర్స్ కు భూ కేటాయిపులుపై కొన్ని నిబంధనలతో క్యాబినేట్ ఆమోదం తెలిపిందనే విషం తెలిసి కూడా జగన్ ముఠా విషం చిమ్ముతుంది. మధురవాడ ఐటీ హిల్స్ లో ఎకరం రూ.కోటి చొప్పున 3.5 ఎకరాలు, కాపులుప్పాడులో ఎకరం రూ.50 లక్షల చొప్పున 56.5 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిన మాట వాస్తవం. ప్రభుత్వం నిర్దేశించిన సమయానికల్లా కంపెనీ కార్యకలాపాలు మొదలు పెట్టి, ఒప్పందం చేసుకున్న ఉద్యోగ కల్పన జరిగిన తర్వాతే సేల్ డీడ్ జరుగుతుంది. లేదంటే భూమిని వెనక్కి తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టంగా తెలియజేసింది. ఇవేమి తెలియకుండా ఎకరం రూ.99 పైసలకే కేటాయించినట్లు అబద్ధపు రాతలు రాస్తున్నారు. అసలు రూ.99 పైసలకే ఇచ్చినట్లు ఆధారం ఏంటి? మీరు చేస్తున్న అబద్ధపు మాటలు నిజమే అయితే రుజువు చేయ్.. మాట్లాడితే ఊరు పేరు లేని కంపెనీ అంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఉర్సా సంస్థ నెట్ వర్త్ ఏంటో తెలుసా? ఆ కంపెనీ పూర్వాపరాలు ఏంటో తెలుసా జగన్ రెడ్డి. ఉర్సా నెట్ వర్త్ వచ్చే 2.5 బిలియన్ డాలర్లు. ఈ సంస్థ ప్రమోటర్ల నెట్ వర్తే రూ.3,700 కోట్లు. ఏ మాత్రం అవగాహన, అర్థం లేని మాటలతో ప్రజలను మభ్య పెట్టాలని జగన్ రెడ్డి ప్రయత్నిస్తున్నాడు. అమెరికాలో రిజిస్టర్ అయిన కంపెనీ ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్. భారతదేశ నిబంధనల ప్రకారం ఇక్కడ పెట్టుబడులు పెట్టాలంటే ఇక్కడ రిజిస్టర్ అయ్యి ఉండాలనే చెప్పడంతో హైదరాబాద్ నుంచి టెంపరరీ అడ్రెస్‌తో రిజిస్టర్ అయింది. రిజిస్టర్ చేసిన చిరునామా కూడా ఉర్సా సీఈవో కౌశిక్ తండ్రి ఉంటున్న ప్రదేశం. లాజిస్టిక్స్ ఇన్ఫ్లుయెన్స్ కోసం అక్కడ తాత్కాలిక కార్యాలయం పెట్టడం జరిగిందని ప్రమోటర్ జై తాళ్లూరి వివరించారు. ఆర్బీఐ అప్రూవ్ చేసిన FDI పాలసీతో ఉర్సా సంస్థ ఏపికి వస్తుంది. టెక్నాలజీ బెస్ట్ ఎంటర్ ప్రైజెస్లను నిర్వహించడంలో దశాబ్దాల అనుభవం ఉన్న సతీష్ అబ్బూరి, జై తాళ్లూరి, ఎరిక్ వార్నర్, కౌశిక్ పెందుర్తిలపై వైసీపీ నిందలు వేస్తుంది. 2023 ఏప్రిల్ 11న మధురవాడ ఐటీ హిల్స్ లో ఎకరం రూ.కోటి చొప్పున 6.29 ఎకరాలను వైజాగ్ టెక్ పార్క్‌కి జగన్ రెడ్డి కేటాయించిన మాట వాస్తవమా కాదా? అప్పుడు సక్రమం అయినది ఇప్పుడు అక్రమం అయిందా? గతంలో విశాఖలో ఎకరం ఒక్క రూపాయికే బ్రాండిక్స్ సంస్థకు జగన్ రెడ్డి కేటాయించిన మాట వాస్తవం కాదా? మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు సంబంధించిన ఎన్‌సీసీ కంపెనీకి రూ.1500 కోట్లు విలువైన 97.30 ఎకరాలు భూమిని రూ.187 కోట్లకే దారాదత్తం చేయలేదా? విశ్వేశ్వర్ రెడ్డికి సంబంధించిన ఇండోసోల్‌కు 8500 ఎకరాలు కేటాయించలేదా? ఇండోసోల్ స్థాపించిన ఐదు నెలలకే ఏ రూపేణా ఇచ్చావు? నీ కుటుంబంపై చిత్రం తీసిన యాత్ర డైరెక్టర్ మహీ వీ రాఘవకు హార్స్లీ హిల్స్ లో రెండు ఎకరాలు ఉచితంగా ఎందుకు ఇచ్చావు? నీ పార్టీ జిల్లా కార్యాలయాల కోసం రూ. 433.84 కోట్లు విలువ గల 43.6 ఎకరాల ప్రభుత్వ భూమిని కేవలం నెలకు రూ.1,000 లీజుతో కొట్టేయాలని చూసిన మాట వాస్తవం కాదా? ఇలా చెప్పుకుంటూ పోతే రాడిసన్, లేపాక్షి నాలెడ్జ్ హబ్, షిర్డీ సాయి, మాజీ మంత్రి బొత్స బయో ఫ్యుయెల్స్ కు కోట్లు విలువచేసే భూమిని అత్యంత తక్కువ ధరకు ఎందుకు ఇచ్చావు? ఇన్ని రకాలుగా అక్రమ కేటాయింపులు జరిపిన నువ్వా భూకేటాయింపులపై మాట్లాడేది..? ఏఐ రంగంలో విశేషమైన అనుభవం ఉండి అంతర్జాతీయంగా గుర్తింపు ఉండి ఆర్థిక సామర్థ్యమున్న వ్యక్తులతో ఏర్పాటు చేసిన కంపెనీపై తప్పుడు ప్రచారం చేస్తావా...? జగన్ రెడ్డిలా షెల్ కంపెనీలు పెట్టటం, వాటి ద్వారా ప్రభుత్వ భూములను, ఖజానాను కొల్లగొట్టడం మరెవ్వరికీ సాధ్యం కాదు. కష్టపడి పైకొచ్చి పది మందికి ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో వచ్చే కంపెనీలను జగన్ రెడ్డి తరిమేయాలనే కుట్రను పన్నాడు. ఐదేళ్ల కాలంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకుండా ఉన్న పరిశ్రమలను తరిమేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను చూసి ఓర్వలేక పారిశ్రామికవేత్తలపై విషం చిమ్ముతున్నారు. ఇకనైనా రోత రాతలు రాయించడం మానుకోవాలి. లేదంటే ఇప్పటికే పాతాళానికి తొక్కిన ప్రజలు ఈసారి అదఃపాతాళానికి తొక్కుతారు.

## గ్రామసభల ద్వారా కౌలుదారులు గుర్తింపు

**తహసిల్దార్ తాతారావు**



**శంఖవరం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** కౌలు రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా అందేందుకు గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించాలని శంఖవరం తహసిల్దార్ ఎ తాతారావు ఆదేశించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ తాతారావు, వ్యవసాయాధికారి పి గాంధీ ఆధ్వర్యంలో కౌలుదారుల గుర్తింపుపై రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో సమన్వయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తాతారావు మాట్లాడుతూ కౌలు రైతుల గుర్తింపుకై మండలంలోని గ్రామ గ్రామాన గ్రామసభలో నిర్వహించాలన్నారు. గుర్తించిన కౌలు రైతుల పూర్తి వివరాలు సేకరించడం ద్వారా వారిని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులను చేయాలన్నారు. ఏవో గాంధీ మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు పత్రాలు జారీ చేయడం ద్వారా ప్రభుత్వ అందించే వడ్డీ లేని రుణాలు పంట బీమా ఇన్పుట్ సబ్సిడీ పంట రుణాలు వంటి పలు రకాల లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నాయన్నారు.

## ప్రత్తిపాడు సిహెచ్సిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



**ప్రత్తిపాడు, ఏప్రిల్ 29 (జనస్వరం) :** మానవతా దృక్పథంతో వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైఖేల్ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రతి మంగళవారం వైద్యం నిమిత్తం వచ్చే గర్భిణీ స్త్రీలకు, రోగులకు దాహార్తిని తీర్చేందుకు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని డాక్టర్ సౌమ్య మైఖేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండలు ఎక్కువగా ఉండడంతో ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు, రోగులు డీహైడ్రేషన్‌కి గురి కాకుండా వివేకానంద సేవా సమితి చేస్తున్న సేవలను కొనియాడారు. మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మంగళవారం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతలు సహకరిస్తే గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మద్దాల అంజి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల్లో ఆనందం, పాడిపంటల సమృద్ధి కోసమే రాజులబాబు ఉత్సవం

**ఎంపీపీ పర్వత రాజబాబు**



**శంఖవరం, ఏప్రిల్ 29 (జనస్వరం) :** ప్రతీ రైతు తాను పండించే పంట సమృద్ధిగా పండాలని, తనకు, తన కుటుంబానికి జీవనాధారమైన వ్యవసాయం వృద్ధి చెందేందుకు సహకారం, తోడ్పాటు, సంరక్షణకు దైవ బలం అవసరమని, వీటి కోసమే రాజులబాబు ఉత్సవాన్ని రైతులంతా ఆనందంతో చేసుకుంటారని శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండల కేంద్రం శంఖవరంలో రైతులు సంయుక్తంగా నిర్వహించిన రాజుల బాబు ఉత్సవంలో గ్రామానికి చెందిన రైతులతో పాటు ఎంపీపీ రాజబాబు, ఆయన తనయుడు వివేక్ పాల్గొని, రైతులతో కలిసి రాజులబాబును దర్శించి, రైతులంతా సుఖ, సంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన విందులో రైతులతో కలిసి సహ ఫంక్తి భోజనం చేసారు. కార్యక్రమంలో అడపా దొంగబాబు, బొమ్మిడి శ్రీను, రేలంగి నాగయ్య, జట్లా బాబులు, రేలంగి సుబ్బారావు, బొమ్మిడి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ పగడాల బాబ్జి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారులు

**- వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు**

**- చైర్మన్‌లు రావి వెంకటేశ్వరరావు, నూకసాని బాలాజీ, పీవీజీ కుమార్**



**మంగళగిరి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం శెరిదగ్గుమిల్లి గ్రామానికి చెందిన పల్లెం పద్మజ విజ్ఞప్తి చేస్తూ.. వైసీపీ వ్యక్తితో అధికారులు కుమ్మక్కై తన అన్న తనకు రాసి ఇచ్చిన ఎకరం పొలంలో 8 సెంట్లను తగ్గించారని.. తగ్గించిన పొలంలో వైసీపీ వ్యక్తి పల్లెం వెంకన్న వాస్ రూమ్స్ కడుతున్నాడని.. దీనిపై ప్రశ్నిస్తే మహిళనని కూడా చూడకుండా అధికారులు తనపై దుర్భాషలాడుతున్నారని.. వారిపై చర్యలు తీసుకొని తన పొలం ఎకరం ఉండేలా చూడాలని నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరావు, టూరిజం డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ నూకసాని బాలాజీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మెన్ పీవీజీ కుమార్ లకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించిన నేతలు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- శ్రీకృష్ణదేవరాయలు కాలంనాటి దేవాలయానికి ఉన్న దారిని వైసీపీ నాయకులు మూసి వేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారని.. అయినా ఎండోన్మెంట్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని.. దయ చేసి అధికారులు స్పందించి భక్తులకు ఇబ్బంది లేకుండా చూసేలా చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం ఛత్రం గ్రామానికి చెందిన తిమ్మప్ప గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.

- కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తెల్లప్రోలు గ్రామానికి చెందిన ప్రభాకర్ రాజు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన భార్య ఆరోగ్యం భాగోలేక ఇంటిని మాత్రం పేతురు అనే వ్యక్తికి అమ్మితే పక్కన ఉన్న స్థలానికి కూడా కాగితాలు పుట్టించి స్థలంలోకి రానివ్వకుండా బెదిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు

- ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన చిన్న వెంకటరెడ్డి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణంతో పాటు శ్మశాన వాటికలో పెరిగిన చిల్లచెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

- నంద్యాల జిల్లా సునిపెంటకు చెందిన సయ్యద్ వాజీద్ బాషా గ్రీవెన్స్‌లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన కూతురు పుట్టినప్పటినుండి అంగవైకల్యంతో బాధపడుతుందని.. దయ చేసి తన కూతురుకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం ప్రెగళ్లపాడు గ్రామానికి చెందిన మూడ మంచు కొండగురవయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తాగునీటి సమస్య రోడ్ల సమస్య ఉందని.. వెంటనే వాటిని పరిష్కరించాలని అభ్యర్థించారు.

- 40 సంవత్సరాలుగా తమ అనుభవంలో ఉన్న భూమిని మరోకరు అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని.. ప్రకాశం జిల్లా పామూరు మండలం దాదిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అబ్బూరి శేషయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. తమ సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించాడు.

- అనంతపురం జిల్లా పామిడికి చెందిన సర్దార్ బాషా గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. రామ గిరిలో ఉన్న తమ భూములను తన తాత బోయ నరసింహులు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారని.. ఇప్పుడు ఆయన కుమారుడు ఆపొలాన్ని చేసుకుంటూ.. గత ఆరు సంవత్సరాలుగా పొలాన్ని ఖాళీ చేయమంటే చేయకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశాడు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చరిత్ర తెలుసుకొని మాట్లాడాలి

**- ఉగ్రదాడిని అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి**

**- ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్**



**విజయవాడ, ఏప్రిల్ 29 (జనస్వరం) :** కాశ్మీర్లో జరిగిన ఉగ్రదాడి అనేది ఒక బాధాకరం ఘటన అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం యూనియన్ టెరిటరీలో భాగం అయ్యి ఉండి, సర్వైలెన్స్ ఫెయిల్యూర్ సెంట్రల్ గవర్నమెంట్‌ది, పోలీస్ కూడా సెంట్రల్ గవర్నమెంట్ చేతుల్లో ఉంటుందన్నారు. ఈ ఘటన జరగక ముందు స్థానికంగా ఉన్న బీజేపీ నేత ఇంట్లో పెళ్లి కార్యక్రమాల్లో పోలీస్ యంత్రాంగం ఉందని, దాడి జరుగుతున్న చాలా సేపటికీ కూడా భద్రత బలగాలు అక్కడికి రాకపోవడంతోనే మరణాలు ఎక్కువగా సంభవించాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫెయిల్యూర్ మీద ఫెయిల్యూర్‌తోనే ఈ ఘటన జరిగిందన్నారు. టెరరిజానికి మతం లేదన్నారు. నేడు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి అవగాహన లేకుండా విమర్శలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. బీజేపీ స్క్రిప్టునే పవన్ కల్యాణ్ చదువుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్‌ను విమర్శించేముందు మిగతా నాలుగు వేళ్లు కూడా, బీజేపీకే చూపిస్తున్నాయన్న విషయం పవన్ కళ్యాణ్ గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒక పేరు చెప్తే పాకిస్థాన్‌కి లాగులు తడుస్తాయ్ అంటే ఆ పేరు భారత దేశ మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీనే అని అన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఈనాటి తరం కొన్ని పార్టీలకు, నాయకులకు దేశ చరిత్ర మీద అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాష్ట్ర డిప్యూటీ సీఎం అని, అతను చరిత్రను తెలుసుకొని మాట్లాడాలి కానీ, ఎవరినో మెప్పించడానికి కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేయొద్దనీ హితవు పలికారు.

## నక్కపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**గొర్రెల కాపరి మృతి, ముగ్గురికి గాయాలు**



**నక్కపల్లి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** మండల పరిధిలోని 16వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. నక్కపల్లి సంత ఎదురుగా, ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను వేగంగా వచ్చిన ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో ట్రాక్టర్ పల్టీలు కొడుతూ పక్కన ఉన్న గొర్రెల కాపరిపై బలంగా పడింది. ఈ ఘటనలో సారిపల్లిపాలెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మామిడి సత్తిబాబు (38) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కూలీలు ం సీతంపాలెం గ్రామానికి చెందిన మడగా శ్రీను, ప్రసాదుల భాస్కర రావు, మేకల నాగేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కి రిఫర్ చేశారు. విశాఖ దిశగా ప్రయాణిస్తున్న ట్యాంకర్ లారీ ఢీకొట్టి ఆగకుండా వాహనంతో పరారైంది. ఘటనపై కేసు నమోదు చేసిన నక్కపల్లి పోలీసులు, పారిపోయిన లారీ డ్రైవర్ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.

## క్రమశిక్షణ, పట్టుదలకు వైభవ్ సూర్య వంశీ ప్రతిరూపం

**- యువ క్రికెటర్లకు ఆదర్శం**

**- ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**



**విజయవాడ, ఏప్రిల్ 29 (జనస్వరం) :** 14 ఏళ్ల వయస్సులో ఐపీఎల్‌లో క్రికెట్ ఆడటమే కేవలం 35 బంతుల్లో సెంచరీ సాధించి అరుదైన రికార్డ్ క్రియేట్ చేసిన యువక్రికెటర్ వైభవ్ సూర్య వంశీ పై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హర్షం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా యంగ్ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ ప్రతిభను ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రశంసించారు. అతి చిన్న వయస్సులోనే దేశ వ్యాప్తంగా మాత్రమే కాక ప్రపంచ స్థాయిలో వైభవ్ సూర్య వంశీ గుర్తింపు సాధించటంతో చాలా ఆనందంగా వుందన్నారు. వైభవ్ సూర్యవంశీ చక్కటి ప్రతిభ కనబర్చారని కొనియాడారు. మంచి భవిష్యత్తు వుంటుందని, మరెన్నో రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఏపీ నుంచి ఇలాంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను వెలికి తీసేందుకు ఏసీఏ కృషి చేస్తుందని తెలిపారు. వైభవ్ సాధించిన సెంచరీ ఆయన క్రమశిక్షణ, నిబద్ధత, పట్టుదలకి నిదర్శనమని కొనియాడారు. యువ క్రికెటర్లు సూర్య వంశీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై జనసేన సంతాప సభ

**మృతులకు ఘన నివాళులర్పించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్**





**మంగళగిరి, ఏప్రిల్ 29 (జనస్వరం) :** పహల్గామ్ ఉగ్రదాడిలో వీరమరణం పొందిన భద్రతా సిబ్బందికి జనసేన పార్టీ ఘన నివాళి అర్పించింది. ఈ ఉదయం మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సంతాప సభలో జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని అమరులకు మౌనప్రార్థనతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర "నా సేనకు నా వంతు" కమిటీ సభ్యురాలు దారం అనిత కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. శహీదులకు జాతీయ గీతంతో నివాళులర్పించిన అనంతరం, ఉగ్రవాదంపై పోరాటం కొనసాగించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. "దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీరులను ఈ దేశం ఎప్పటికీ మరిచిపోదు," అని ఆమె అన్నారు. సభలో పాల్గొన్న నేతలు దేశ భద్రతపై తమ కృతజ్ఞతా భావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమం సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.